మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 21-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 233 Issue: 233

Published from Jagitial
www.evarthalu.com

21 ఫిబ్రవరి 2026 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:43 సూర్యాస్తమయం - సా. 6:16 తిథి చవితి మ. 12:59 వరకు తరువాత పంచమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం రేవతి రా. 7:07 వరకు తరువాత అశ్విని యోగం శుభ మ. 3:42 వరకు కరణం విష్టి మ. 12:59 వరకు బవ రా. 12:06o వరకు వర్జ్యం ఉ. 7:37 నుండి ఉ. 9:09 వరకు దుర్ముహూర్తం ఉ. 8:15 నుండి ఉ. 9:01 వరకు రాహుకాలం ఉ. 9:36 నుండి ఉ. 11:03 వరకు యమగండం మ. 1:56 నుండి మ. 3:23 వరకు గుళికాకాలం ఉ. 6:43 నుండి ఉ. 8:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:07 నుండి తె. 5:55 వరకు అమృత ఘడియలు సా. 4:48 నుండి సా. 6:20 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:06 నుండి మ. 12:52 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున



## జీవన్ రెడ్డిని అవమానించొద్దు

### కష్టకాలంలోనూ పార్టీతోనే ఉన్నారు..టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డికి రాజకీయంగా ఎన్ని ఆఫర్లు వచ్చినా పార్టీలోనే కొనసాగారని, అలాంటి నాయకుడికి పార్టీలో అవమానం జరగకుండా చూడాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు.

సంగారెడ్డి, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): ఎంపీగా, ఎమ్మెల్యేగా టిక్కెట్లు ఇచ్చి పార్టీ ఆయనను ప్రోత్సహించిందని, కానీ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల ఆయన ఓడిపోయారని అన్నారు. కానీ ఆయన ఎప్పుడూ పార్టీ గీతను దాటలేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కూడా జీవన్ రెడ్డి పార్టీలోనే కొనసాగారని తరువాయి 2 వ పేజీలో...



## హామీ ఇచ్చి అవమానిస్తున్నారు!

### కాంగ్రెస్ అధిష్ఠానంపై రాజగోపాల్ రెడ్డి అసహనం


మాట ప్రకారం మంత్రి పదవి ఇవ్వండి..లేదంటే నేరుగా ముఖ్యమంత్రి పదవిపైనే గురి పెడుతా అంటూ సెన్సేషనల్ కామెంట్స్ చేసిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి.. మరోసారి తన అసహనాన్ని బయటపెట్టారు. ఓ టీవీ ఇటర్వ్యూలో మాట్లాడుతూ.. బీజేపీని ప్రశంసించారు.

మునుగోడు, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): అసెంబ్లీ ఎన్నికలు జరగడానికి ముందు రాజగోపాల్‌రెడ్డి బీజేపీ లోనే ఉన్నారు కదా. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్ రెడ్డితో పడకపోవడంతోనే రాజగోపాల్ రెడ్డి బీజేపీలోకి వెళ్లారు. రేవంత్ రెడ్డి ఒంటెద్దు పోకడలు నచ్చకనే తాను తరువాయి 2 వ పేజీలో...

# బాంబు బూచీ!

### పెరుగుతున్న బెదిరింపుల కాల్స్, మెయిల్స్.. కోర్టులు, పాఠశాలలే టార్గెట్‌గా చర్యలు


### 2025లోనే దాదాపు 500 సంఘటనలు.. రెండ్రోజులుగా కోర్టులకు బెదిరింపు




దేశవ్యాప్తంగా విద్యాసంస్థలు, న్యాయస్థానాలను లక్ష్యంగా చేసుకుని వస్తున్న నకిలీ బాంబు బెదిరింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. ముఖ్యంగా గత కొద్ది రోజులుగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఢిల్లీ, నోయిడా వంటి నగరాల్లో ఈ తరహా మెయిల్‌లు, కాల్స్ వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాల్లోని పలు కోర్టులకు ఒకేసారి బాంబు బెదిరింపులు రావడం కలకలం రేపింది. హైదరాబాద్‌లోని నాంపల్లి క్రిమినల్ కోర్టుకు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు రావడంతో న్యాయమూర్తులు, సిబ్బందిని వెనువెంటనే ఖాళీ చేయించారు. అయితే, బాంబ్ స్క్వాడ్ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.

(ఈవార్తలు ఇన్వెస్టిగేషన్ డెస్క్)

రాజమహేంద్రవరం, కరీంనగర్, అనంతపురం, ధర్మవరం కోర్టులకు కూడా బాంబులు ఉన్నాయంటూ మెయిల్‌లు వచ్చాయి. 12 గంటల తర్వాత పేలుతాయని మెయిల్‌లో పేర్కొన్నట్లు తెలిసింది. అదీకాక ఈ నెల 16న ఉత్తరప్రదేశ్‌లోని లక్నో, వారణాసి, అయోధ్య సహా 18 జిల్లాల కోర్టులకు బెదిరింపులు వచ్చాయి. రాజస్థాన్ హైకోర్టు (జైపూర్ బెంచ్) కు కూడా ఫిబ్రవరిలో వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వచ్చాయి. విద్యార్థుల పరీక్షల సమయంలో స్కూళ్లకు ఈ తరహా బెదిరింపులు రావడం తల్లిదండ్రులను తీవ్ర తరువాయి 2 వ పేజీలో...



## తెలంగాణకు కేంద్రం 387 కోట్లు

తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు రూ. 387.80 కోట్లను కేంద్ర ఆర్థిక శాఖ శుక్రవారం విడుదల చేసింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): ఇవి ప్రధానంగా రాష్ట్రంలోని స్థానిక సంస్థల (మున్సిపాలిటీలు, పంచాయతీ రాజ్ సంస్థలు) అభివృద్ధి కోసం ఉద్దేశించిన నిధులు. ఈ నిధులను గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ వంటి పనులకు వినియోగించాల్సి ఉంటుంది. గత కొంతకాలంగా వినియోగ ధృవీకరణ తరువాయి 2 వ పేజీలో...



# టీజీలో ఏఐ విలేజ్!

## కృత్రిమ మేధకు పెద్దపీట వేస్తాం

### కేంద్రంలోనూ ఏఐ మంత్రిత్వ శాఖ ఉండాలి.. ఏఐ సమ్మిట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

ప్రస్తుతం టెక్నాలజీ ప్రపంచం దూసుకెళ్తోందని, ఏఐ రాకతో మరింత వేగం పెరిగిందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సదస్సు (ఏఐ సమ్మిట్)కు దేశ, విదేశాల నుంచి అతిథులు హాజరైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తెలంగాణ నుంచి హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐ సదస్సులో ప్రసంగించారు.

న్యూఢిల్లీ: ఏఐ టెక్నాలజీలో భారత్ కూడా పరుగులు పెట్టాలంటే దాని కోసం కేంద్ర ప్రభుత్వంలో స్పెషల్‌గా ఒక మంత్రిత్వ శాఖను రూపొందించాలని ప్రధాని మోదీకి సూచించారు. ఏఐ వినియోగం, కంట్రోల్, మార్గదర్శకాలు, నేషనల్ సెక్యూరిటీ వంటి అంశాలను ఈ మంత్రిత్వ శాఖ అత్యవసరం అని పేర్కొన్నారు. ప్రపంచ టెక్ దిగ్గజాలన్నీ ఈ ఏఐ సదస్సుకు వచ్చాయని.. మనం చేసే ఆలోచనలే జీవితాలు -2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,737 |
| వెండి (గ్రాము): | రూ.270 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,016 |

## విశ్వవాణి




లావు తొడలు కలిగినవాళ్లు ఎక్కువ కాలం జీవిస్తారని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. ఎందుకంటే, వాళ్ల శరీరాలు చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయని, గుండె మంట తదితర సమస్యలను తగ్గిస్తాయని వెల్లడైంది.



## కస్తూర్బాగాంధీ స్కూల్లో ఫుడ్ పాయిజన్

### 25 మంది విద్యార్థినులకు అస్వస్థత.. మెదక్ జిల్లా రేగోడ్‌లో ఘటన

పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం విద్యార్థినుల ప్రాణాల మీదకు తెచ్చింది. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 25 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు.



## గాంధీ స్టాచ్యూ భూసేకరణ వాయిదా!

### ప్రజల నుంచి వ్యతిరేకత రావడం వల్లే?

మూసీ ప్రాజెక్టులో భాగంగా రూ.5,000 కోట్లతో నిర్మించ తలపెట్టిన గాంధీ విగ్రహం నిర్మాణానికి అవసరమైన భూ సేకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గింది. శనివారం బండ్లగుడా జాగిర్ వార్డ్ ఆఫీసులో జరగాల్సిన భూసేకరణ సమావేశాన్ని వాయిదా పడింది. అయితే.. ప్రజాగ్రహం దృష్ట్యా తాత్కాలికంగానే భూ సేకరణను ప్రభుత్వం వాయిదా వేసినట్టు సమాచారం.

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): మూసీ సుందరీకరణ పేరుతో ప్రజాధనం దుర్వినియోగం చేయడాన్ని, వేలాదిమందిని నిరాశ్రయులను చేయడాన్ని ప్రతిపక్షాలు ఖండిస్తున్నాయి. ఇదిలా ఉండగానే రూ.5000 కోట్లతో మూసీ నది ఒడ్డున భారీ గాంధీ విగ్రహం పెట్టేందుకు రేవంత్ ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే.. ప్రజలు, ప్రజా సంఘాలు, పర్యావరణవేత్తలు, రాజకీయ పార్టీల నుండి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయినా సరే మూసీ సుందరీకరణ తరువాయి 2 వ పేజీలో...

# గీ టారిఫ్‌లు ఏందివయ్యా?

మీకు ఆ అధికారమే లేదు
అమెరికా సుప్రీంకోర్టు తీర్పు
ట్రంప్ టారిఫ్‌లు కొట్టివేత

### నా వద్ద ప్లాన్ బీ ఉంది: ట్రంప్



అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. పలు దేశాలపై ఇష్టారీతిన సుంకాలు పెంచుకుంటూ పోతున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాకిస్తూ కీలక తీర్పును వెల్లడించింది. టారిఫ్‌లు విధించే అధికారం అధ్యక్షుడికి కానీ, వైట్‌హౌస్‌కు కానీ లేదని ప్రకటించింది.


న్యూయార్క్: ఫలితంగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్‌ల పెంపు పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు తొమ్మిది మంది కూడని అమెరికా సుప్రీంకోర్టు తన తీర్పును ప్రకటించింది. ముగ్గురు జడ్జిలు తరువాయి 2 వ పేజీలో...

## బంగ్లా-భారత్ వీసా సేవలు పునరుద్ధరణ

### తారిఖ్ రహమాన్ కీలక నిర్ణయం



ఢాకా: బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తారిఖ్ రహమాన్ ఇండియాకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నాడు. బంగ్లాదేశ్‌కు వెళ్లేందుకు భారతీయులకు జారీ చేసే వీసా సేవల్ని పునరుద్ధరించాడు. ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో ఈ సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. రెండు దేశాల మధ్య వీసాల జారీ రెండు నెలలక్రితం నిలిచిపోయింది. మూడు నెలల క్రితం బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు జరిగాయి. అలాగే ఇండియాలో ఆశ్రయం పొందుతున్న మాజీ ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని బంగ్లా డిమాండ్ చేసింది. ఈ పరిణామాల నేపథ్యలో తరువాయి 2 వ పేజీలో...



## 'సర్'పై జడ్జీల నిఘా

### బెంగాల్‌లో ప్రక్రియపై సుప్రీం నిర్ణయం

న్యూఢిల్లీ/కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో జ్యుడీషియరీ పరిశీలనలో సర్ (ఎస్ఐఆర్) ప్రక్రియ జరిపించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎన్నికల సంఘం (ఈసీ), బెంగాల్ ప్రభుత్వం మధ్య నమ్మకం లేదని, అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపింది. మాజీ అదనపు జిల్లా జడ్జీలను సర్ తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

21.2.2026

మేషం: సన్నిహితులతో విలువైన విషయాలు గూర్చి చర్చిస్తారు. చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణ సూచనలున్నవి. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలు లాభాలబాటలో సాగుతాయి. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. జీవిత భాగస్వామితో శుభకార్యాలలో పాల్గొంటారు.

వృషభం: బంధు, మిత్రుల నుంచి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. ఆర్థిక పరంగా అనుకూల వాతావరణం ఉంటుంది. చేపట్టిన పనులలో ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. శత్రు సంభందమైన సమస్యలు నుండి ఉపశమనం కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తికరంగా సాగుతాయి. ఉద్యోగాలలో నూతన అవకాశాలు అందుకుంటారు.

మిధునం: ఆదాయానికి మించిన ఖర్చులు ఉంటాయి. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. నిరుద్యోగ ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఇతరులతో మాటపట్టింపులు ఉంటాయి. దూరప్రయాణాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఉద్యోగ వాతావరణం కొంత చికాకు కలిగిస్తుంది.

కర్కాటకం: ఇంటా బయట అదనపు బాధ్యతల వలన చికాకు పెరుగుతుంది. మానసిక అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. నూతన ఋణాలు చెయ్యవలసి వస్తుంది. బంధు,మిత్రులతో స్వల్ప మాట పట్టింపులుంటాయి. వృత్తి వ్యాపారాలు స్వల్పంగా లాభిస్తాయి. ఉద్యోగస్తులకు ఆకస్మిక స్థానచలన సూచనలున్నవి.

సింహం: కుటుంబ సభ్యులతో దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. అన్నివైపుల నుండి ఆదాయం అందుతుంది. ప్రయాణాలలో నూతన వ్యక్తుల పరిచయాలు లాభిస్తాయి. వ్యాపార విస్తరణకు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి. వృత్తి, ఉద్యోగాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఆర్ధిక అనుకూలత కలుగుతుంది.

కన్య: అవసరానికి మించిన ఖర్చులు పెరుగుతాయి. కీలక విషయాలలో ద్విస్వభావ ఆలోచనలు చెయ్యడం మంచిది కాదు. ముఖ్యమైన వ్యవహారాలు కొంత నిదానంగా పూర్తవుతాయి. వృత్తి వ్యాపారాలలో మందకొడిగా సాగుతాయి. ఉద్యోగాలలో అధికారులతో సమస్యలు తప్పవు. నిరుద్యోగులకు కొన్ని విషయాలలో నిరాశ పెరుగుతుంది.

తుల: ఆర్ధిక వ్యవహారాలు సంతృప్తి కలిగిస్తాయి.స్నేహితుల నుండి ఊహించని సహాయం అందుతుంది. ఇంటా బయట మరింత ఉత్సాహంగా ముందుకు సాగుతారు. నూతన వ్యాపారాల్లో మరింత పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. దూరపు బంధువుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి.

వృశ్చికం: ఇతరుల వ్యవహారాలలో జోక్యం చేసుకోవడం మంచిది కాదు. నిరుద్యోగులు కొంత ఓర్పుతో ప్రయత్నాలు చేయాలి. ఆర్థిక విషయంలో లోటుపాట్లు ఉంటాయి. నేత్ర సంబంధిత అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. వృత్తివ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి.

ధనస్సు: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. నిరుద్యోగులకు అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఆలోచనలు కార్యరూపం దాల్చుతాయి. భూ సంబంధిత వివాదాలు పరిష్కారమై ఊరట చెందుతారు. వ్యాపారాలకు నూతన పెట్టుబడులు అందుతాయి. ఆర్ధిక వ్యవహారాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు.

మకరం: ధనపరంగా అనుకూల వాతావరణం ఉంటుంది. దైవ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. సమాజంలో ప్రముఖుల నుండి ఆహ్వానాలు అందుతాయి. వృత్తి వ్యాపారాలలో సమస్యలు అధిగమించి లాభాలు అందుకుంటారు. నిరుద్యోగులు లభించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి.

కుంభం: దూర ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. గృహమున కొందరి ప్రవర్తన మానసికంగా చికాకు కలిగిస్తుంది. చేపట్టిన వ్యవహారాలలో ప్రతికూల వాతావరణం ఉంటుంది. జీవిత భాగస్వామితో పుణ్య క్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగాలలో తొందరపాటు నిర్ణయాలు చేసి ఇబ్బందిపడతారు. వ్యాపారమున ఆర్ధిక ఇబ్బందులు కలుగుతాయి.

మీనం: కుటుంబ వ్యవహారాలలో అధిక కష్టంతో అల్ప ఫలితం పొందుతారు. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశపరుస్తాయి. ఆర్థిక ఇబ్బందులు బాధిస్తాయి. వాహన ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపారాలలో ఒడిదుడుకులు పెరుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పనిభారం ఉంటుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

# బాంబు బూచీ!




ఆందోళనకు గురిచేస్తోంది. సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు జరుగుతున్న సమయంలో నోయిడాలోని 12 పాఠశాలలకు, ఢిల్లీలోని 3 స్కూళ్లకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. దాంతో విద్యార్థులను వెంటనే తరలించి తనిఖీలు చేపట్టగా, అవి నకిలీవని తేలింది. ఫిబ్రవరి 9న ఢిల్లీలోని సుమారు 10 ప్రముఖ పాఠశాలలకు ఉదయం 8:30 గంటల సమయంలో బెదిరింపులు వచ్చాయి. మధ్యాహ్నం 1:11 గంటలకు పేలుళ్లు జరుగుతాయని మెయిల్‌లో పేర్కొన్నారు. జనవరి 28న చండీగఢ్‌లోని 26 పాఠశాలలకు, ఫిబ్రవరి మధ్యలో మొహాలిలోని పలు పాఠశాలలకు హ్యూమన్ బాంబ్ దాడి జరుగుతుందని హెచ్చరికలు వచ్చాయి.

**2025లో నకిలీ బెదిరింపులు**

2024-25 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా విద్యాసంస్థలపై బాంబు బెదిరింపుల పరంపర తీవ్రస్థాయికి చేరింది. అధికారిక గణాంకాలు, నివేదికల ప్రకారం, 2024 నుంచి 2025 చివరి వరకు దేశవ్యాప్తంగా సుమారు 500 నుంచి 600 పైగా పాఠశాలలకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయని అంచనా. కేవలం 2024లోనే ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్ వంటి నగరాల్లో కలిపి వందలాది పాఠశాలలు ఇటువంటి భయాందోళనలను ఎదుర్కొన్నాయి. 2024 మేలో ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో ఒకే రోజు సుమారు 200 పాఠశాలలకు మూకుమ్మడిగా బెదిరింపు మెయిల్స్ రావడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 2025 సెప్టెంబర్‌లోనూ పలు విమానాశ్రయాల్లో ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలోని 300-400 పాఠశాలలను లక్ష్యం చేసుకుంటూ భారీ స్థాయిలో హోక్స్ మెయిల్స్ వచ్చాయి. కోల్‌కతాలో దాదాపు 200 పాఠశాలలు, అహ్మదాబాద్‌లో 40 పైగా, జైపూర్‌లో 50 పైగా పాఠశాలలు ఇటువంటి బెదిరింపులకు గురయ్యాయి. వీటిలో 95% పైగా ఈ-మెయిల్ ద్వారానే వస్తున్నాయి. రష్యా లేదా యూరప్ దేశాలకు చెందిన ఐపీ అడ్రస్‌లను వాడుతూ, వీపీఎన్, ఎన్‌క్రిప్టెడ్ మెయిల్ సేవలను ఉపయోగించి నిందితులు తమ గుర్తింపును దాచుకుంటున్నారు. పోలీసుల దర్యాప్తులో తేలిన సమాచారం ప్రకారం, పరీక్షలను వాయిదా వేయడానికి విద్యార్థులు చేసిన అల్లరి పనులు చేస్తున్నారని అనుమానిస్తున్నారు. అయితే, నిఘా వ్యవస్థను గందరగోళానికి గురిచేసేలా విదేశీ శక్తులు ప్రయత్నం చేస్తుండవచ్చునని కూడా అనుమానం వ్యక్తం అవుతోంది.

## దర్యాప్తు సంస్థలకు సవాళ్లు

పోలీసులు, సైబర్ సెల్ అధికారులు ఈ కేసులను ఛేదించలేకపోవడానికి కొన్ని కీలక కారణాలు ఉన్నాయి. బెదిరింపు మెయిల్స్ విదేశీ సర్వర్ల నుండి వచ్చినప్పుడు, ఆ దేశాల నుండి సమాచారం సేకరించడానికి మ్యూచువల్ లీగల్ అసిస్టెన్స్ ట్రీటీ ద్వారా అభ్యర్థించాలి. ఈ ప్రక్రియకు నెలల తరబడి సమయం పడుతుంది. స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో డేటా ప్రైవసీ చట్టాలు చాలా కఠినంగా ఉంటాయి. నిందితుల వివరాలు ఇవ్వడానికి ఆయా దేశాల కంపెనీలు సమ్మతించవు. నిందితులు తాత్కాలిక ఈ-మెయిల్ ఐడీలను సృష్టించి, పని పూర్తి కాగానే వాటిని డిలీట్ చేస్తున్నారు. దీనివల్ల డిజిటల్ ట్రయల్ కష్టమవుతోంది.

### గణాంకాలివీ

2024లో డిసెంబర్ నాటికి సుమారు 206 పాఠశాలలు బాంబు బెదిరింపులకు గురయ్యాయి.

కేవలం మే 1, 2024 ఒక్కరోజే ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలోని సుమారు 200 పాఠశాలలకు మూకుమ్మడిగా బెదిరింపు మెయిల్స్ వచ్చాయి.

2025లో ఈ సంఖ్య భారీగా పెరిగి 500 దాటిపోయింది. సెప్టెంబర్ 28, 2025న జరిగిన ఒకే ఒక అతిపెద్ద దాడిలో ఢిల్లీలోని దాదాపు 300-400 పాఠశాలలను లక్ష్యంగా చేసుకున్నారు.

స్కూళ్లతో పాటు విమానాలకు వచ్చే బాంబు కాల్స్ కూడా 2024లో రికార్డు స్థాయిలో పెరిగాయి.

కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, 2024లో భారతీయ విమానయాన సంస్థలకు 728 నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ కేసులకు సంబంధించి 2024లో ప్రభుత్వం 13 మందిని అరెస్టు చేసింది.

పాఠశాలలే కాకుండా 2024లో ఆసుపత్రులు, హోటళ్లు, ఎయిర్‌పోర్టులతో కలిపి సుమారు 977 ప్రదేశాలకు నకిలీ బాంబు బెదిరింపులు వచ్చాయి.

# టీజీలో ఏఐ విలేజ్!

మొదటి పేజీ తరువాయి

మార్చేస్తాయని తెలిపారు. మనుషుల కంటే ఏఐకి మరిన్ని ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని రేవంత్ రెడ్డి వెల్లడించారు. సమాజంలో అగ్ని, చక్రం, వ్యవసాయం, విద్యుత్, ఇంటర్నెట్ వంటి కొత్త కొత్త ఆవిష్కరణలు ప్రపంచాన్ని ఏ విధంగా మార్చాయో.. ఇప్పుడు ఏఐ కూడా అలాంటి విప్లవాత్మక టెక్నాలజీ అని సీఎం రేవంత్ రెడ్డి అభివర్ణించారు. ఏఐ కేవలం ఇంకో టెక్నాలజీ మాత్రమే కాదని.. మానవ పరిణామ క్రమంలో చాలా కీలక మలుపు అని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఉన్న మెషీన్లు, టెక్నాలజీల లాగా కాకుండా ఏఐ స్వయంగా నేర్చుకోగలదని.. సమాచారాన్ని విశ్లేషించగలదని.. దానికి అనుగుణంగా నిర్ణయాలు కూడా తీసుకుంటుందని వెల్లడించారు. అయితే ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ఏఐ టెక్నాలజీలో పోటీ మొదలైందని.. ఏఐలో కొన్ని దేశాలు, కంపెనీలు చాలా అడ్వాన్స్‌డ్‌గా ఉన్నాయని రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో పారిశ్రామిక విప్లవాల్లో అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోవడాన్ని గుర్తు చేసిన సీఎం రేవంత్.. ఈసారి భారత్ అలాంటి తప్పిదం చేయకూడదని ముందస్తు జాగ్రత్తలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా సర్వీసులు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో అప్రతిహత విజయాలు దక్కించుకున్న భారత్.. ప్రపంచ స్థాయి కోర్ టెక్నాలజీ ఉత్పత్తుల్లో కూడా నాయకత్వం వహించాలని పిలుపునిచ్చారు. భారత్‌కు నేషనల్ ఏఐ రోడ్‌మ్యాప్ చాలా అత్యవసరమని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఏఐ డెవలప్‌మెట్‌కు సంబంధించి ప్రతీ దశలో సెమీకండక్టర్ చిప్ తయారీ, జీపీయూ సామర్థ్యాలు, డేటా సెంటర్లు, గ్రీన్ ఎనర్జీ వినియోగం, ఏఐ ప్లాట్‌ఫామ్‌లు, అప్లికేషన్లు వంటి స్పష్టమైన వ్యూహాలతో భారత్ ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రపంచంలో ఏఐ తెస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు కేంద్ర రాష్ట్రాల సమన్వయంతో జాతీయ ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తే హైదరాబాద్‌లో అలాంటి ఏఐ వార్ రూమ్ ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. వరల్డ్ క్లాస్ రీసెర్చ్‌లు చేసేందుకు దేశంలో ఏఐ యూనివర్సిటీని నెలకొల్పాలని సూచించారు. ఏఐ అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఉద్యోగాల కోతపై వస్తున్న ఆందోళనలను ప్రస్తావించిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏఐ కారణంగా కొన్ని రంగాల్లో ఉద్యోగాలు పోవడం ఖాయమన్నారు. అదే సమయంలో మనం కొత్తగా స్కిల్స్ నేర్చుకోవడం, ఉన్న వాటిని అప్ గ్రేడ్ చేసుకోవడం ద్వారా కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

# హామీ ఇచ్చి అవమానిస్తున్నారు!

మొదటి పేజీ తరువాయి

బీజేపీకి వెళ్లానని, కాని బీజేపీ తనను ఎంతో గౌరవించిందని అన్నారు. బీజేపీలో తనను పిలిచి నేషనల్ ఎగ్జిక్యూటివ్ మెంబర్, స్టేట్‌లో స్టీరింగ్ కమిటీ చైర్మన్ ఇచ్చారని, అంత గౌరవించాక కూడా కాంగ్రెస్ పార్టీ కన్నతల్లిలాంటిదని అందులోకి తిరిగి ఆహ్వానిస్తున్నారు కదా అని వచ్చానని అన్నారు. గౌరవం కాపాడుతారని నమ్మి కాంగ్రెసులోకి వచ్చాను. మంత్రి పదవి ఇవ్వకపోయిన పర్వాలేదు కానీ తనను అవమానించిన తీరు బాగోలేదన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వచ్చాక ఈ రెండేళ్లుగా తనను పార్టీలోకి తీసుకువచ్చిన సునీల్ కనుగోలు, భట్టి విక్రమార్క, మాణిక్ రావు థాక్రే, మహేశ్ కుమార్ గౌడ్ మొదలైనవారు తన పట్ల ప్రవర్తించిన తీరు చాలా అవమానకరంగా ఉందని మండిపడ్డారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కేసీ వేణుగోపాల్ భువనగిరి ఎంపీ సీటు సాధిస్తే మంత్రి హామీని నెరవేరుస్తామని మాట ఇచ్చారని చెప్పారు. తనకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో అధిష్టానానికి ఇబ్బందులు ఉండవచ్చన్నారు. కానీ నాయకులు తన పట్ల మాట్లాడిన పద్ధతి, ప్రవర్తించిన తీరు బాగాలేవన్నారు. మంత్రి పదవి ఇవ్వలేకపోతున్నామనే విషయాన్ని కనీసం పిలిచి చెప్పకపోవడం దుర్మార్గమన్నారు. ఉప ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఫలితాలు ఎప్పుడు అధికార పార్టీకే అనుకూలంగా ఉంటాయన్నారు. కానీ నిజంగా ప్రజల్లో ఏం ఉంది? మనం ఇచ్చిన హామీలు ఎంత మేరకు నెరవేర్చాం అన్నది ముఖ్యం అన్నారు. బీఆర్ఎస్□పై చేసిన ఆరోపణలపై ఏం చర్యలు తీసుకున్నాం? మన పాలన అవినీతి లేకుండా కొనసాగుతోందా? ఇచ్చిన హామీలు ఎంత మేరకు నెరవేర్చాం? మంత్రివర్గ విస్తరణ పూర్తయిందా? కీలక పదవుల్లో ఎవరున్నారు? అనేది ముఖ్యం అన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి అయినా రెండేళ్ల పాటు ఇన్ని శాఖలు తన వద్దే పెట్టుకున్నారా? అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ప్రశ్నించారు.

# కస్తూర్బాగాంధీ స్కూల్లో ఫుడ్ పాయిజన్

**25 మంది విద్యార్థినులకు అస్వస్థత.. మెదక్ రేగోడ్‌లో ఘటన**

మెదక్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): పాఠశాల నిర్వాహకుల నిర్లక్ష్యం విద్యార్థినుల ప్రాణాల మీదకు తెచ్చింది. మెదక్ జిల్లా రేగోడ్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కలుషిత ఆహారం తిని 25 మంది విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. మధ్యాహ్నం వండిన కూరనే రాత్రికి వడ్డించడమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. గురువారం (ఫిబ్రవరి 19) మధ్యాహ్నం విద్యార్థినులకు భోజనంలో గుడ్డు కూర వడ్డించారు. అయితే, అదే కూరను పారేయకుండా, రాత్రికి దానినే పులుసుగా మార్చి మళ్ళీ విద్యార్థినులకు వడ్డించినట్లు సమాచారం. ఈ వికృత పోకడ కారణంగా భోజనం చేసిన కొద్దిసేపటికే విద్యార్థినులకు వాంతులు, కడుపునొప్పి మొదలయ్యాయి. అస్వస్థతకు గురైన 25 మంది విద్యార్థినులను పాఠశాల సిబ్బంది వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి మెరుగైన చికిత్స అందుతోంది. బాధితుల్లో ఇప్పటికే 10 మంది కోలుకుని డిశ్చార్జ్ అయ్యారని, మిగిలిన వారు వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ ఘటనపై విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల ప్రాణాలతో చెలగాటమాడుతున్న హాస్టల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారుల తనిఖీలు లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు పునరావృతమవుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు.

# గీ టారిఫ్‌లు ఏందివయ్యా?

మొదటి పేజీ తరువాయి

మాత్రం టారిఫ్‌లను సమర్థించగా, అత్యధిక శాతం 6 మంది జడ్జిలు వ్యతిరేకించారు. సుంకాలు విధించే అధికారం దేశాధ్యక్షుడికి లేదని వారు స్పష్టం చేశారు. సుంకాలు విధించే అధికారం కేవలం అమెరికా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని సుప్రీం తన తీర్పులో పేర్కొంది. వాణిజ్యం, పన్నులకు సంబంధించిన అంశాలపై అధికారం అమెరికా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని వెల్లడించింది. ఇప్పటివరకూ వసూలు చేసిన వందల బిలియన్ డాలర్ల సుంకాలు దిగుమతి దారులకు ఇవ్వాల్సి రావొచ్చని కూడా సుప్రీం తెలిపింది. భారత్‌పై విధించిన 18 శాతం సుంకాలు కూడా అనధికారమేనని సుప్రీం పేర్కొంది. ఫలితంగా ఇప్పటికే పలు దేశాలపై సుంకాలు విధించిన ట్రంప్‌కు భారీ ఎదురుదెబ్బ తగిలినట్లయ్యింది.

# ..భూసేకరణ వాయిదా!

మొదటి పేజీ తరువాయి

ప్రాజెక్టు విషయంలో ముందుకే పోవాలని సీఎం నిర్ణయించుకున్నారు. డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ తయారు కాకున్నా.. ఏషియన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు రుణం మంజూరు చేయకున్నా హడావిడిగా గాంధీ విగ్రహం ఏర్పాటుకు రేవంత్ సిద్ధమవుతున్నారు. మూసీ నది ఒడ్డున రూ. 5000 కోట్లతో దేశంలోనే ఎత్తైన గాంధీ విగ్రహం నిర్మాణానికి ఫిబ్రవరి నెలలోనే శంకుస్థాపన చేయాలని భావిస్తున్నారు. గాంధీ విగ్రహం కోసం.. ఈసీ, మూసీ నదుల సంగమంలోని10 ఎకరాల భూసేకరణకు ఈ నెల 19న ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం 3,279 ఎకరాలు, 10,017 ఇండ్లు, షాపులు సేకరించనున్నారు. అయితే నోటిఫికేషన్ ఇచ్చిన భూమిలో మధు పార్క్ రిడ్జ్ అపార్టుమెంట్ కాంప్లెక్స్ ఉంది. ఇందులో నివసించే సుమారు 500 కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో నిర్ణయాన్ని వాయిదా వేసినట్లు సమాచారం.

# బంగ్లా-భారత్ వీసా సేవలు పునరుద్ధరణ

మొదటి పేజీ తరువాయి

ఇరు దేశాల మధ్య సంబంధాలు క్షీణించాయి. దీంతో గత ఏడాది డిసెంబర్ నుంచి రెండు దేశాల మధ్య రాయబార కార్యాలయాల్లో సేవలు నిలిచిపోయాయి. ముఖ్యంగా రెండు దేశాల మధ్య వీసాల జారీ ఆగిపోయింది. ఇటు ఢిల్లీలోని బంగ్లాదేశ్ రాయబార కార్యాలయంలో, అటు ఢాకాలోని భారత రాయబార కార్యాలయంలో వీసాల జారీ నిలిచిపోయింది. అయితే, తాజాగా బంగ్లా ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తారిఖ్ రహమాన్ మూడు రోజుల్లోనే ఇండియాతో సంబంధాల విషయంలో సానుకూలంగా స్పందించాడు. వీసాలు పునరుద్ధరిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఢిల్లీలో శుక్రవారం ఉదయం నుంచి బంగ్లా రాయబార కార్యాలయంలో అన్ని రకాల వీసాల మంజూరు సేవలు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఢాకాలో కూడా బంగ్లా నుంచి ఇండియాకు వచ్చేందుకు వీసాల సేవల్ని పునరుద్ధరిస్తామని అనిరుద్ధా దాస్ అనే బంగ్లాలోని భారత రాయబార కార్యాలయ అధికారి తెలిపారు. మెడికల్, టూరిజం వంటి అన్ని రకాల వీసా సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇక.. బంగ్లాలో తారిక్ ప్రమాణ స్వీకారానికి ఇండియా నుంచి లోకసభ స్పీకర్ ఓం బిర్లా హాజరయ్యారు. తాజాగా తారిక్ ఇండియాతో సంబంధాల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్నారు.

# ‘సర్’పై జడ్జీల నిఘా

మొదటి పేజీ తరువాయి

ప్రక్రియను పరిశీలించే జ్యుడీషియల్ ఆఫీసర్లుగా కలకత్తా హైకోర్టు సీజే నియమిస్తారని తేల్చిచెప్పింది. ‘బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిచేయడమే ప్రధాన సమస్య. ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నా.. రెండు రాజ్యాంగ విభాగాలైన ప్రభుత్వం, ఈసీ మధ్య నమ్మకం కనిపించడం లేదు. ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకుంటూ ఉన్నారు’ అని సీజేఐ సూర్యకాంత్, జస్టిస్ జోయమాల బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం పంచోలీతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ బ్లేమ్ గేమ్ వల్ల తమ వద్ద మరో ఆప్షన్ లేకుండా పోయిందని, అందుకే జ్యుడీషియల్ పరిశీలకులను నియమించాలని నిర్ణయించామని తెలిపింది. మైక్రో అబ్జర్వర్లను ఈసీ నియమించడాన్ని టీఎంసీ సర్కారు తప్పు పడుతోంది, అదే సమయంలో ఎలక్టోరల్ రిజిస్టర్ ఆఫీసర్లుగా వ్యవహరించేందుకు సరిపడా గ్రూప్ బీ అధికారులను మమత సర్కారు కేటాయించలేదనిఈసీఅంటోంది.ఈ క్రమంలోనే హైకోర్టు నియ మించే జ్యుడీషియల్ అధికారులు ఈఆర్‌వోలుగా సేవలందిస్తారని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది.

# తెలంగాణకు కేంద్రం 387 కోట్లు

మొదటి పేజీ తరువాయి

పత్రాలు మరియు ఇతర సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయిన నిధులను, రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు పూర్తి చేయడంతో కేంద్రం ఇప్పుడు విడుదల చేసింది. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, గ్రామీణ స్థానిక సంస్థలకు ఈ నిధులు అందడం వల్ల గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయడానికి అవకాశం కలుగుతుంది. ఈ నిధుల విడుదలతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పంచాయతీలకు మరియు స్థానిక సంస్థలకు కొంత ఊరట లభించినట్లయింది.

# జీవన్ రెడ్డిని అవమానించొద్దు

మొదటి పేజీ తరువాయి

అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులకు తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెబుతానని అన్నారు. మొదటి నుంచి పార్టీలో ఉన్న వారికి అన్యాయం జరగకూడదని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో అధిష్ఠానం చొరవ తీసుకోవాలని అన్నారు. కాగా, తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్ ఎంపీ సురేశ్ రెడ్డి, కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ సింఘ్వీ పదవీకాలం వచ్చే ఏప్రిల్ నెలలో ముగియనుంది. ఈ నేపథ్యంలో వచ్చే నెల 16న తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో తనకు అవకాశం ఇవ్వాలని అధిష్ఠానాన్ని కోరేందుకు జగ్గారెడ్డి ఢిల్లీకి చేరుకున్నారు. పార్టీకి చెందిన మరో సీనియర్ నేత వీ హనుమంతరావు కూడా తనకు అవకాశం ఇవ్వాలంటూ ఇప్పటికే అధిష్ఠానానికి లేఖ రాశారు.



## వారంలోగా అక్రెడిటేషన్ల కమిటీలు

### జిల్లా డీపీఆర్వోలకు ఆదేశాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): జిల్లాస్థాయి అక్రెడిటేషన్ కమిటీలను వారం రోజులలో పూర్తి చేయాలని డీపీఆర్వోలను సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ ఆడిటోరియంలో అక్రెడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ విధి విధానాలపై డీపీఆర్వోలకు, క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జీఓ నెం.252, 103లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పీఆర్వోలకు సూచించారు. జిల్లాస్థాయి అక్రెడిటేషన్ కమిటీలను సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకుని స్థానిక ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ ప్రతినిధులతో ఒక కమిటీని వారం రోజులలో పూర్తి చేయాలని ఆమె వెల్లడించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా, ఫ్రిలాన్స్, వెటరన్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల నమోదు, దరఖాస్తుల పరిశీలన, రిపోర్టులు, అప్రూవూడ్ లిస్టులు, రిజిస్ట్రేషన్ నెంబర్ అలాట్ మెంట్, అక్రెడిటేషన్ కార్డుల డౌన్ లోడింగ్, మొదలగు అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఆమె సంబంధిత అధికారులను కోరారు. అదే విధంగా అక్రెడిటేషన్ కార్డుల ప్రక్రియలో భాగంగా ఆన్ లైన్, ఇతర సమస్యలు తలెత్తితే వెంటనే రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మీడియా రిలేషన్ వింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే టెక్నికల్ టీమ్ ప్రధాన కార్యాలయంలో అందుబాటులో ఉంటారని వారిని కూడా సంప్రదించి ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా అక్రెడిటేషన్ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు.

## నాంపల్లి కోర్టుకు మళ్లీ బాంబు బెదిరింపులు

నాంపల్లి-హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ కోర్టుకు మరోసారి బాంబు బెదిరింపులు వచ్చాయి. దుండగులు ఈమెయిల్ ద్వారా కోర్టు సిబ్బందికి ఈరోజు బెదిరింపులు పంపారు. కోర్టు ప్రాంగణంలో బాంబు అమర్చామని, దానికి టైం కూడా సెట్ చేశామని, బాంబు పేలబోతోందని ఈమెయిల్ ద్వారా బెదిరించారు. వెంటనే కోర్టు సిబ్బంది పోలీసులు, క్విక్ రెస్పాన్స్ టీమ్, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా నిమిషాల వ్యవధిలోనే వారు కోర్టు వద్దకు చేరుకున్నారు. అప్పటికే అక్కడున్న న్యాయవాదులు, కక్షిదారులను బయటకు పంపించారు. బాంబు, డాగ్ స్క్వాడ్ తో తనిఖీలు నిర్వహించారు. ఈనెల 18వ తేదీ కూడా నాంపల్లి కోర్టుకు బంబు బెదిరింపులు వచ్చాయి. అదే రోజున కరీంనగర్, అనంతపురం, రాజమండ్రి కోర్టులకు కూడా బెదిరింపులు రావడం గమనార్హం. అయితే, ఆయా కోర్టుల్లో నిర్వహించిన తనిఖీల్లో బాంబుల ఆచూకీ లభించలేదు. ఇవన్నీ నకిలీ బెదిరింపులుగా పోలీసులు నిర్ధారించారు.



## మైత్రివనం ఆదిత్య ఎన్‌క్లేవ్‌లో అగ్ని ప్రమాదం

అమీర్‌పేట-హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని అమీర్‌పేట చౌరస్తా మైత్రివనం వద్ద ఉన్న ఆదిత్య ఎన్‌క్లేవ్ భవనం మొదటి అంతస్తులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నీలగిరి బ్లాక్‌లోని రాందేవ్ ఇన్ఫోటెక్, శివమ్ టెక్నాలజీ దుకాణాలలో మంటలు అలముకున్నాయి. ఈ భవనంలో కోచింగ్ సెంటర్‌లు ఉంటాయి. దీనితో ఆయా కోచింగ్ సెంటర్‌లలోని విద్యార్థులు కిందకు వచ్చేశారు. విద్యార్థులను పోలీసులు, హైడ్రా సిబ్బంది నిచ్చెనల ద్వారా కూడా సురక్షితంగా తీసుకువచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేసింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం విషయం తెలియగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా సిబ్బంది హుటాహుటిన మైత్రివనంకు తరలి వచ్చారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని ప్యానెల్ బోర్డులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మొదటి అంతస్తు వరకు మంటలు రావడం, పొగలు రెండో అంతస్తు వరకు వ్యాపించడంతో భవనాన్ని ఖాళీ చేయించారు.

## సర్‌కు సన్నాహాలు ముమ్మరం

### ఏఈఆర్ఓలకు సీఈవో శిక్షణ

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్‌చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు (ఏఈఆర్ఓలు) ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు. మొత్తం 195 మంది ఏఈఆర్ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. రాబోయే ఎస్ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

## రేపు టీజీసెట్ పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు) : తెలంగాణ గురుకుల కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (టీజీసెట్- 2026)ను రేపు (22వ తేదీన) రాష్ట్రవ్యాప్తంగా 492కేంద్రాల్లో నిర్వహించనున్నారు. సెట్ చీఫ్ కన్వీనర్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి ఎస్ కృష్ణఆదిత్య శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకులాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో, 6నుంచి 9వ తరగతుల వరకు మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి పరీక్ష కొనసాగుతుందని వెల్లడించారు.

# నాకు 5 నిమిషాలు చాలు: రాజాసింగ్

వరంగల్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): మరాఠా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా గురువారం వరంగల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న రాజాసింగ్.. ఎంఐఎం పార్టీ అగ్రనేతలు అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సెక్యూరిటీ లేకుండా వస్తే.. ఎవరి సత్తా ఏంటో చూపిద్దాం అంటూ బహిరంగ సవాల్ చేశారు. ప్రతీ సభలో 15 నిమిషాలు అంటూ ఓవైసీ బ్రదర్స్ కామెంట్లు చేస్తున్నారన్న రాజాసింగ్.. 15 నిమిషాలు కాకుండా 15 ఏళ్లు సమయం ఇచ్చినా వాళ్లు ఏమీ చేయలేరని రాజాసింగ్ ఎద్దేవా చేశారు. ఓవైసీ బ్రదర్స్‌కు దమ్ముంటే 15 నిమిషాలు కాదని.. తనకు 5 నిమిషాలు చాలు అని తెలిపారు. అవే డైలాగ్‌లు మళ్లీ మళ్లీ చెబుతూ టైమ్ పాస్ చేయడం మానుకోవాలని రాజాసింగ్ హితవు పలికారు. ఇదే విషయం గతంలో కూడా తాను చెప్పానని.. మళ్లీ ఇప్పుడు కూడా చెబుతున్నానని పేర్కొన్నారు. ఓవైసీ బ్రదర్స్ సెక్యూరిటీ లేకుండా రావాలని.. తాను కూడా సెక్యూరిటీ లేకుండా వస్తానని సవాల్ విసిరారు. తనకు తుపాకులు, కత్తులు వద్దని.. తన చేతులతోనే చంపేస్తానంటూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి కారణం అవుతున్నాయి. ప్లేస్ ఎక్కడో మీరే డిసైడ్ చేయండి అంటూ ఓవైసీ బ్రదర్స్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మీ అడ్డాకు రావాలా లేక మీ ఇంటికే రావాలా అంటూ కామెంట్లు చేశారు. దమ్ముంటే ప్లేస్ మీరే డిసైడ్ చేయాలని ఓవైసీ బ్రదర్స్‌కు ఛాలెంజ్ విసిరారు. ఆ 5 నిమిషాల్లో తామేంటో ప్రత్యక్షంగా చూపిస్తానని అక్బరుద్దీన్ ఓవైసీకి రాజాసింగ్ బహిరంగ సవాల్ విసిరారు. డేట్, టైమ్, ప్లేస్ అన్నీ నువ్వే డిసైడ్ చేయ్.. ఎక్కడికైనా రావడానికి తాను రెడీగా ఉన్నానని తెలిపారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా గతంలో అక్బరుద్దీన్ ఓవైసీ మాట్లాడారని.. దానికి జవాబు చెప్పే రోజు దగ్గర్లోనే ఉందంటూ తీవ్ర హెచ్చరికలు చేశారు. ఓవైసీ బ్రదర్స్ రాజకీయాలు ఓల్డ్ సిటీ దాటి బయటికి రావడం లేదని విమర్శలు చేశారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలకు సభకు వచ్చిన యువతను ఉర్రూతలూగించాయి. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. ఒకప్పుడు భారత్‌పై ఉగ్రదాడి జరిగితే పాకిస్తాన్‌కు లవ్ లెటర్ రాసేవాళ్లని ఎద్దేవా చేసిన రాజాసింగ్.. కానీ ఇప్పుడు మాత్రం నేరుగా సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్స్ చేసే ప్రభుత్వం ఉందని గత ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఛత్రపతి శివాజీ నుంచే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సర్జికల్ స్ట్రైక్ నేర్చుకున్నారని చెప్పారు.



# ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

### లంచం తీసుకుంటూ పట్టుబడ్డ మంథని సబ్ రిజిస్ట్రార్

### భూమి రిజిస్ట్రేషన్ కోసం రూ.16,500 డిమాండ్

మంథని, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): పెద్దపల్లి జిల్లాలోని మంథనిలో ఓ ప్రభుత్వ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంథని సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కాసర్ల రాజేందర్, భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం స్వీకరిస్తుండగా అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే, ఒక వ్యక్తి కొనుగోలు చేసిన భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు సబ్ రిజిస్ట్రార్ రాజేందర్ రూ. 16,500 లంచం డిమాండ్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. రాజేందర్ సూచన మేరకు, బాధితుడు ఆ డబ్బును రషీద్ అనే ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు మంథని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇస్తుండగా ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు ప్రజలకు కీలక సూచన చేశారు. ఏ ప్రభుత్వ అధికారి అయినా లంచం డిమాండ్ చేస్తే, తమ టోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వాట్సాప్ (9440446106), ఫేస్‌బుక్, అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా తమను సంప్రదించవచ్చని తెలిపారు. ఫిర్యాదుదారుల వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.





## దేవాదులకు దిక్కేది?

### 2 వేల కోట్లు ఖర్చుపెట్టలేరా?

### మాజీమంత్రి హరీశ్ ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా నిలిస్తే కాంగ్రెస్ సర్కార్ మాత్రం ఏమీ పట్టనట్టుగా ఉంటోందని ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. తమ హయాంలో దేవాదుల ప్రాజెక్టు మీద రూ.7,300 కోట్లు ఖర్చు పెట్టి 80 శాతం పనులు పూర్తి చేశామని పేర్కొన్న ఆయన రేవంత్ ప్రభుత్వం కనీసం రూ.2 వేల కోట్లు కూడా ఖర్చు చేసేందుకు సిద్ధంగా లేదని మండిపడ్డారు. 'కేసీఆర్ పాలనలో మేము దేవాదుల ప్రాజెక్టుకు ప్రాధాన్యమిచ్చాం. రూ.7.300 కోట్ల ఖర్చుతో 47 వేలు ఉన్న ఆయకట్టును, 3 లక్షల 17 వేల ఎకరాలకు పెంచాం. మరో 33 వేల ఎకరాలు ఈ ప్రాజెక్టుకు అవసరమవ్వగా.. 30 వేల ఎకరాలు భూసేకరణ కూడా పూర్తి చేశాం. ఇంకొక 3వేల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంది. దాదాపు రూ.1,000 నుండి రూ.2,000 కోట్లు ఖర్చు పెడితే ఇంకో 2,40,000 ఎకరాల ఆయకట్టు సృష్టించవచ్చు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన రెండున్నర ఏండ్లలో కనీసం రూ.100 కోట్లు కూడా ఖర్చు చేయలేదు' అని కాంగ్రెస్‌పై విరుచుకుపడ్డారు.

## కడియం వెన్నుపోటుదారుడు : నన్నపనేని

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): కడియం శ్రీహరి అంటే కమిట్మెంట్ కాదని వెన్నుపోటు దారుడని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి చంద్రబాబు పంచనచేరి పదేళ్లు మంత్రి పదవులు అనుభవించాడని, అనంతరం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరి ఎంపీ, ఎమ్మెల్సీ, డిప్యూటీ సీఎం పదవులు పొంది కేసీఆర్‌కు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. క డియం శ్రీహరి లాంటి రాజకీయ కుట్రదారు ఎవరూ లేరని అన్నారు. రాజకీయ అధికారం కోసం ఎన్ని పార్టీలైన మారుస్తారని, ఇక చివరకు మిగిలింది కమ్యూనిస్టు పార్టీలేనని అన్నారు. ఫోన్‌లో సిమ్స్ మార్చినట్లు పార్టీలు మార్చడం ఆయనకు అలవాటేనని అన్నారు. డొక్కు స్కూటర్ మీద వచ్చిన కడియం శ్రీహరికిభూములు, పెట్రోల్ బంక్, ఇండ్లు ఎక్కడి నుంచి వచ్చాయో వెల్లడించాలని డిమాండ్ చేశారు. నాడు అనేక మంది దళితులను ఎన్ కౌంటర్ చేయించారని పేర్కొన్నారు. కడియం శ్రీహరికి ఇజ్జత్ ఉంటే బీఆర్ఎస్ బీ ఫామ్‌పై గెలిచిన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కడియం కుట్రలు తెలిసి కేసీఆర్ రెండవ సారి మంత్రి పదవి ఇవ్వలేదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌కు జాతిపిత ఇచ్చారని వెల్లడించారు. కేసీఆర్ కాళ్లు కడిగి నెత్తిన చల్లుకున్నా కడియం శ్రీహరికి మోక్షం రాదని , అవాక్కులు చెవాక్కులు పేల్చినకడియం శ్రీహరి కేసీఆర్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# కులాల వల్లే ఈ పరిస్థితులు

### ఇప్పుడిప్పుడే హిందువులు మారుతున్నరు.. ఒవైసీ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): 'రెడ్డి', 'రావు' ఎవరైనా తమ కాళ్ల వద్దకు రావాల్సిందేనని ఇటీవల మజ్లిస్ పార్టీ శాసన సభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అక్బరుద్దీన్ వ్యాఖ్యలపై బీజేపీ శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. అక్బరుద్దీన్ హిందువుల పట్ల హీనంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాల కారణంగా చాలామంది కులాలుగా విడిపోయారని, ఇది మజ్లిస్ పార్టీకి చులకన అయిందని అన్నారు. కానీ ఇప్పుడు తామంతా కులాలను మరిచిపోయి హిందువులుగా మారుతున్నామని అన్నారు. ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో హిందువులంతా ఏకమవుతున్నారని అన్నారు. అక్బరుద్దీన్ ఒవైసీ కూడా అలాంటి విమర్శలు చేస్తే చీము నెత్తురు లేని హిందువులకు తెలిసి వస్తుందని అన్నారు. హిందువులు పాములు అని అక్బరుద్దీన్ విమర్శలు గుప్పించారని, అదే నిజమైతే మీరు మూడు కోట్ల నుంచి 20 కోట్లకు వచ్చేవారా? అని నిలదీశారు. అసలైనా పాములు ఒవైసీ లాంటివారేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హిందువులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. అక్కడ హిందువులను పాములై కరుస్తున్నారని రాకేశ్ రెడ్డి అన్నారు. ఒవైసీ సోదరులు ఎప్పుడూ హిందువులకు, హిందుత్వానికి వ్యతిరేకంగా ఉంటారని ఆరోపించారు. కొన్ని రోజుల క్రితం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరీంనగర్‌లో అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రెడ్డి అయినా, రావు అయినా తమ వద్దకు రావాల్సిందేనని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రుల వద్దకు మేం వెళ్లమని, వారే మా వద్దకు వస్తారని అన్నారు. పనులు కావాలన్నా, సీఎం కావాలన్నా మా మద్దతు ఉండాల్సిందే అన్నారు. ఒవైసీల మద్దతు లేకుండా రాజకీయాలు చేయడం సాధ్యం కాదని వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తి తమ పార్టీకే ఉందని అన్నారు.



## 'ఏఐ'ని వాడితేనే ప్రమోషన్లు: యాక్సెంచర్

న్యూఢిల్లీ: ప్రముఖ గ్లోబల్ కన్సల్టింగ్ దిగ్గజం యాక్సెంచర్, ప్రమోషన్ల అర్హతలో కృత్రిమ మేధ (ఏఐ)ను క్రమం తప్పకుండా ఉపయోగించడం ఒక కీలకమైన అంశంగా మార్చింది. సీనియర్ ఉద్యోగులు 'ఏఐ' టూల్స్‌ను తప్పనిసరిగా ఉపయోగించుకోవాలని యాక్సెంచర్ సూచించింది. వాటి వినియోగం ఆధారంగా కూడా లీడర్‌షిప్ రోల్స్ అందుకుంటారని, లేదంటే ప్రమోషన్లు ఉండవని సంకేతాలు ఇచ్చింది. కంపెనీలు డిజిటల్ మార్పును వేగవంతంగా అందిపుచ్చుకుంటున్నాయి. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ రంగం 'ఏఐ'ని అందిపుచ్చుకుని మెరుగైన పనితీరును కనబరచాలని ఆయా సంస్థలు భావిస్తున్నాయి. ఈ క్రమంలో యాక్సెంచర్ ఉద్యోగుల ప్రమోషన్లకు సంబంధించి ఈ కీలక సూచన చేసింది. సీనియర్ మేనేజర్లు, అసోసియేట్ డైరెక్టర్లకు కంపెనీ మెయిల్ ద్వారా ఈ సందేశం పంపించినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. లీడర్‌షిప్ పాత్రలో ఎదగడానికి ఏఐ సాధనాలను క్రమం తప్పకుండా ఉపయోగించాలని స్పష్టం చేసింది. క్లయింట్లకు అత్యుత్తమ, వేగవంతమైన సేవలు అందించడానికి ఇది అవసరమని యాక్సెంచర్ భావిస్తోంది. యాక్సెంచర్ కొంతకాలంగా ఏఐపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఏఐతో రీస్కిల్ చేయడం సాధ్యంకాని ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. మరోవైపు, కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేని ఉద్యోగులు స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేయాలని గూగుల్ ఇటీవల తెలిపింది. ఇందుకోసం విరమణ ప్యాకేజీని కూడా ప్రకటించింది. అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ తదితర టెక్ దిగ్గజాలు కూడా గూగుల్ బాటలోనే పయనించాయి.

## నొప్పులు భరించలేక కత్తితో కోసుకున్న గర్భిణి

లక్నో: ఆసుపత్రికి తీసుకు వెళ్లే వారు లేక.. పురిటి నొప్పుల తీవ్రతను తట్టుకోలేక ఓ గర్భిణీ తన కడుపును కత్తితో కోసుకున్న ఉదంతం కలకలం రేపుతోంది. ఒంటరితనం.. ఆపై తీరని వేదనతో యూపీలోని నంద్వాల్ గ్రామానికి చెందిన నంకై (35) జీవితం గత ఆరు నెలలుగా కష్టాలతోనే సాగుతోంది. అనారోగ్యంతో భర్త చనిపోవడంతో గర్భిణీ అయిన ఆమె ఒంటరిగానే కాలం వెళ్లదీస్తోంది. నెలలు నిండడంతో గురువారం మధ్యాహ్నం ఆమెకు అకస్మాత్తుగా ప్రసవ నొప్పులు మొదలయ్యాయి. సహాయం కోసం కేకలు వేసినా ఎవరూ వినిపించలేదు. నొప్పులు క్షణక్షణానికి రెట్టింపవుతుంటే, ఆ బాధను భరించలేక విచక్షణ కోల్పోయిన ఆమె.. వంటింట్లోని కూరగాయలు కోసే కత్తితో తన పొత్తికడుపును కోసుకుంది. ఆమె ఆర్తనాదాలు విన్న గ్రామస్థులు పరుగెత్తుకుంటూ వచ్చి చూడగా.. రక్తపు మడుగులో పడి ఉన్న నంకైని చూసి హతాశులయ్యారు. కడుపు కోసుకోవడంతో పేగులు బయటకు వచ్చిన స్థితిలో ఆమెను అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ, వైద్యుల సమక్షంలో ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. బిడ్డ క్షేమంగానే ఉన్నప్పటికీ, తీవ్ర రక్తస్రావం కారణంగా నంకై పరిస్థితి విషమంగా మారింది. జిల్లా ఆసుపత్రికి తరలించినప్పుడు ఆమె గాయాలను చూసి వైద్యులు విస్తుపోయారు. "ఆమెను తీసుకువచ్చినప్పుడు పరిస్థితి దారుణంగా ఉంది. గాయం చాలా లోతుగా ఉండటంతో పాటు తీవ్ర రక్తస్రావం జరిగింది" అని మెడికల్ సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆమెను లక్నో ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె మృత్యువుతో పోరాడుతోంది.

## ఆబ్కారీ అధికారులకు గన్స్!

### మంత్రి జూపల్లి కృష్ణారావు వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): స్మగ్లర్ల ఆగడాలను అరికట్టడంతో పాటు అధికారుల ఆత్మరక్షణ కోసం ఎక్సైజ్ శాఖకు ఆయుధాలు ( ఔముజూశీఅం ) ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇచ్చి ఆయుధాలను అప్పగిస్తామని వెల్లడించారు. తెలంగాణ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీ, క్యాలెండర్లను రవీంద్రభారతిలో మంత్రి జూపల్లి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మాదకద్రవ్యాల మహమ్మారిని రాష్ట్ర సరిహద్దుల వరకూ తరిమికొట్టి, తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. డ్రగ్స్ వల్ల కలిగే సామాజిక అనర్థాలపై ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్ ఫ్రీ తెలంగాణే లక్ష్యం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలను పణంగా పెట్టి గంజాయి ముఠాను అడ్డుకునే క్రమంలో కానిస్టేబుల్ సౌమ్య మృతి చెందడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కోటి రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అదనపు కమిషనర్ సయ్యద్ యాసిన్ ఖురేషీ, ఎక్సైజ్ అకాడమీ డైరెక్టర్ సురేష్ రాథోడ్, జాయింట్ కమిషనర్ జి.అంజన్ రావు, డిప్యూటీ కమిషనర్ జె. హరికిషన్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సూర కృష్ణ, జనరల్ సెక్రటరీ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## మత్స్యావతారంలో యాదగిరి నర్సన్న దర్శనం

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): యాదగిరిగుట్టపై పంచ నారసింహుడిగా కొలువైన దేవ దేవుడు మత్స్యావతారంలో భక్తులకు దర్శనం ఇచ్చాడు. స్వామి వారి ప్రధానాలయం లక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శుక్రవారం నిత్యపూజ కైంకర్యాల అనంతరం మూలమంత్ర, మూర్తి మంత్ర హోమాలను వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని అభిషేకించి మత్స్యావతారుడిగా అలంకరించి ఆస్థానం చేశారు. నాలుగు వేదాలు, పురాణాలు, ఉపనిషత్తులు, దివ్యప్రబంధ ప్రాశుర పఠనాలను కనుల పండువగా చేపట్టారు. దుష్ట శిక్షణ..శిష్ట రక్షణ కోసం మహా విష్ణువు అవతార రూపాల్లో స్వామివారిని ఉత్సవాల్లో అలంకరించి సేవించడం ప్రత్యేకత అంటూ ప్రధానార్చకులు మత్స్యావతార విశిష్టతను వివరించారు. పట్టు వస్త్రాలు, బంగారు, వజ్రాభరణాలు, వివిధ రకాల పుష్పాలతో దివ్య మంగళకరంగా మూలమంత్ర జప స్తోత్రాలు సాగుతుండగా గోవిందనామ స్మరణ మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భవాని శంకర్, అనువంశిక ధర్మకర్త బీ. నరసింహ మూర్తి, డీఈవో భాస్కర్ శర్మ, ప్రధాన అర్చకులు కందూరి వెంకటాచార్యులు, భట్టర్ సురేంద్రాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



# జేఎన్‌జే డైరెక్టర్ పోస్టుకు 5 నామినేషన్లు

బషీర్‌బాగ్–హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): జవహర్ లాల్ నెహ్రూ మ్యూచువల్లీ కో ఆపరేటివ్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలో ఒక డైరెక్టర్ పోస్టుకు శుక్రవారం 5 నామినేషన్లు దాఖలయ్యాయి. ఐదింటిలో సాగర్ కుమార్ రెండు సెట్లు, మంజులారెడ్డి రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాగినికర్ శ్రీకాంత్ రావు ఒక నామినేషన్ వేశారు. శనివారం ఉపసంహరణకు గడువు విధించారు. ఈ ఎన్నికకు మార్చి 1న పోలింగ్ జరగనుంది. కాగా, సొసైటీలో ఆర్థిక అక్రమాలు జరిగాయని, ఈ అక్రమాలకు బాధ్యులుగా 5 గురు డైరెక్టర్లతో కూడిన బాడీని రద్దు చేయాలని, విచారణ జరిపించి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, ఈ ఎన్నికలపై స్టే ఇవ్వాలని కొందరు సభ్యులు సహకార శాఖ ట్రిబ్యునల్‌లో కేసు వేశారు. విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ 5 డైరెక్టర్లను 23న వాదనలు వినిపించాలని సమన్లు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియపై స్టే కోసం కూడా కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపైనా హైకోర్టులో 23న విచారణ జరగనుంది.

# అసెంబ్లీలో హెల్త్ వర్కర్ల సమస్యలు లేవనెత్తాలి

**ఎమ్మెల్సీ అంజిరెడ్డికి ఎస్పీఎస్ అసోసియేషన్ విజ్ఞప్తి**




హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): ప్రభుత్వ ఆస్పత్రులు, ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పని చేస్తున్న హెల్త్ వర్కర్ల సమస్యలను అసెంబ్లీలో లేవనెత్తాలని ఎమ్మెల్సీ అంజిరెడ్డిని తెలంగాణ రాష్ట్ర శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్వైజర్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ కమిటీ కోరింది. శుక్రవారం ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిసిన కమిటీ సభ్యులు.. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టం (ఐఎఫ్ఎంఐఎస్)లో 17,800 మంది కార్మికులను చేర్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. దీనిపై ఎమ్మెల్సీ సానుకూలంగా స్పందించారని, న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు కమిటీ అధ్యక్షుడు కుర్రి సైదయ్య తెలిపారు. అంజిరెడ్డిని కలిసినవారిలో ఎస్పీఎస్ ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేశ్, రాష్ట్ర కమిటీ ఎస్పీఎస్ కోశాధికారి పత్తిపాటి శ్రీనివాస్, ఎస్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర కమిటీ సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈదునూరి అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు.



# సూర్య దేవాలయంలో కుంకుమపూజలు

జగిత్యాల టౌన్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాతలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేశారు. అమ్మ వారికి ఒడి బియ్యం సమర్పించారు. కుంకుమ పూజ అనంతరం లక్కీ డిప్ ద్వారా ఒక్కరిని ఎంపిక చేసి వారికి అమ్మ వారి శేష వస్త్రం, అమ్మ వారి ప్రసాదం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీజ్ఞానయజ్ఞం ట్రస్ట్– విజయవాడ తిరుసాయి రచించిన 'నాలో మహాభారతం' పుస్తకాలను నిర్వాహకులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వద్లగట్ల రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మహిళా సమితి సభ్యులు వొడ్నాల లత, వద్లగట్ల స్వాతి, విజయ, నీరజ, రుచిత, చైతన్య, హర్షిణి, గంగవ్వ, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



# మందకృష్ణతో మర్యాదపూర్వక భేటీ

కరీంనగర్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ మున్సిపల్ ఎన్నికల్లో 16వ వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన దుమాల రాజ్ కుమార్.. శుక్రవారం ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట దుమాల గంగారాం, బాలె శంకర్, కాంతక్క, బోనగిరి కిషన్, అనిల్, సునీల్ తదితరులు ఉన్నారు.

# కన్నడ నటుడు శివరాజ్‌కుమార్‌కు పవన్ శుభాకాంక్షలు



మంగళగిరి, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ప్రముఖ కన్నడ నటుడు శివరాజ్‌కుమార్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. చిత్ర పరిశ్రమలో శివరాజ్‌కుమార్ 40 సంవత్సరాల సుదీర్ఘ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా పవన్ ఈ శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన తన సందేశాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ఒక ప్రకటన విడుదల చేశారు. "కరుణడ చక్రవర్తి శ్రీ శివరాజ్‌కుమార్ గారికి నా హృదయపూర్వక అభినందనలు. సినిమా రంగంలో నాలుగు అద్భుత దశాబ్దాలు పూర్తి చేసుకున్న మీరు, ప్రతి తరాన్నీ మంత్రముగ్ధులను చేస్తూ, మీ బహుముఖ ప్రతిభతో, శక్తివంతమైన నటనలతో ఆకట్టుకున్నారు. మీ తండ్రి, నాకు అత్యంత ఇష్టమైన హీరో కన్నడ సూపర్‌స్టార్ డాక్టర్ రాజ్‌కుమార్ గారి వారసత్వాన్ని మీరు గర్వంగా ముందుకు తీసుకువెళ్తున్నారు. మీ రాబోయే ప్రాజెక్టుల్లో మరిన్ని విజయాలు, మంచి ఆరోగ్యం, సంతోషం లభించాలని కోరుకుంటున్నాను" అని పవన్ పేర్కొన్నారు. కన్నడ లెజెండరీ నటుడు డాక్టర్ రాజ్‌కుమార్ కుమారుడైన శివరాజ్‌కుమార్, 1986లో విడుదలైన 'అనురాగ బంధన' చిత్రంతో వెండితెరకు పరిచయమయ్యారు. అప్పటి నుంచి వందలాది చిత్రాల్లో నటించి, కన్నడనాట 'శివణ్ణ'గా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారు. ఈ మైలురాయి సందర్భంగా కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు శివరాజ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.


# సీసీ కాపీ కోసం 5 వేలు లంచం

మంథని, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టులో లంచం తీసుకుంటూ ముగ్గురు ఉద్యోగులు ఏసీబీకి పట్టుబడ్డారు. ఏసీబీ వరంగల్ డీఎస్పీ సాంబయ్య వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కర్కపల్లి శివారులో రైతు గోపాల్‌రావుకు చెందిన 14 ఎకరాల భూమిపై కాల్వ రాంరెడ్డి లోయర్ కోర్టులో 1984లో సివిల్ దావా వేశాడు. కిందిస్థాయి కోర్టు నుంచి ఈ కేసు జిల్లా సెషన్స్ కోర్టుకు రాగా ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ కోర్టులో 2025 సెప్టెంబర్ 21న గోపాల్‌రావుకు అనుకూలంగా తీర్పు వచ్చింది.

# ఆరోగ్య రంగంలో 'మెధాజెన్ ఏఐ' విప్లవం

## వైద్య రంగ నూతన ఆవిష్కరణల్లో కీలక పాత్ర.. ఆరోగ్య నిపుణులు, విద్యార్థుల నుంచి విశేష స్పందన


హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): ప్రస్తుత సాంకేతిక ప్రపంచాన్ని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) శాసిస్తోంది. ఏఐ ప్రతి రంగాన్ని వేగవంతంగా అభివృద్ధి చేస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆరోగ్య రంగంలో కూడా కృత్రిమ మేధ విప్లవానికి శ్రీకారం చుట్టింది మెధాజెన్ ఏఐ. భారతదేశంతో పాటు ప్రపంచవ్యాప్తంగా వైద్యం, ఆరోగ్య వ్యవస్థల్లో ఏఐ వినియోగాన్ని విస్తృత స్థాయిలో అమలు చేయాలనే లక్ష్యంతో 'మెధాజెన్ ఏఐ' ఆవిష్కృతమైంది. బుధవారం ఈ మెధాజెన్ ఏఐ ను వర్చువల్ గా అధికారికంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, ఆరోగ్య నిపుణులు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు పాల్గొని ఆరోగ్యరంగంలో ఏఐ ఆధారిత మార్పుకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మెధాజెన్ ఏఐ సీఈవో డా. భరత్ కుమార్ కక్కిరేణి మాట్లాడుతూ ఆరోగ్యం రంగంలో మెధాజెన్ ఏఐ దీర్ఘకాలిక లక్ష్యాలు, ప్రయోజనాలను వివరించారు. ఈ ఏఐ ద్వారా ఆసుపత్రులను ఇంటలీజెంట్, డేటా ఆధారిత ఆరోగ్య ఎకోసిస్టంలుగా మార్చాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు. క్లినికల్ నిర్ణయాలకు మద్దతు ఇవ్వడం, ఆసుపత్రి పనితీరును మెరుగుపరచడం, పరీక్షల్లో కచ్చితమైన నిర్ధారణ, మెరుగైన ఫలితాల కోసం ఏఐ కీలకమని అభిప్రాయపడ్డారు. ఏఐ నైతికత, డేటా గోప్యత, వివరణాత్మక పద్ధతుల ద్వారా వైద్యుల నమ్మకాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని భరత్ కుమార్ ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వక్త సమీర్ సలీబా మాట్లాడుతూ "వాస్తవ ప్రపంచంలో ఆరోగ్య రంగంపై ఏఐ వినియోగం" అనే అంశంపై ప్రసంగించారు. ఈ ఏఐ ద్వారా నియంత్రణ నిబంధనలు, ఆసుపత్రి వ్యవస్థలతో అనుసంధానం, వైద్యుల ఆమోదం, విస్తృత స్థాయి అమలు వ్యూహాలు వంటి అంశాలను ఆయన వివరించారు. ముఖ్య అతిథిగా మల్లారెడ్డి యూనివర్సిటీ ప్రతినిధి వినోద్ కుమార్ యాట మాట్లాడుతూ ఆరోగ్య రంగంలో కృతిమ మేధ పాత్రను వివరించారు. ఇమేజింగ్, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు, ఓమిక్స్ డేటా ద్వారా ప్రిసిషన్ మెడిసిన్ సాధ్యమని చెప్పారు. మేధాజెన్ ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అభిరామ్ రెడ్డి మాట్లాడుతూ వైద్యం, ఆరోగ్య సంరక్షణలో సహకారాన్ని పెంపొందించడానికి మేధాజెన్ ఏఐ నిబద్ధతను వివరించారు. మెధాజెన్ ఏఐ వైద్య రంగంలో ఆవిష్కరణలు, సామర్థ్యం పెంపు, వాస్తవ పరిస్థితుల్లో మెడికల్ ఏఐ పరిష్కారాల అమలుకు ఒక సమిష్టి వేదికగా పనిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. క్లినికల్ డెసిషన్ సపోర్ట్ సిస్టమ్స్, ప్రిడిక్టివ్ మరియు ప్రివెంటివ్ హెల్త్ అనలిటిక్స్, డిజిటల్ హాస్పిటల్ రూపాంతరం, స్టార్టప్ ఇన్నొవేషన్, విద్యార్థులు మరియు ఆరోగ్య నిపుణులకు ప్రాయోగిక శిక్షణ కార్యక్రమాలపై ప్రధానంగా దృష్టి సారించనుంది. ఈ మెధాజెన్ ఏఐ ఆవిష్కరణ కార్యక్రమానికి వైద్యులు, పరిశోధకులు, విద్యార్థులు, స్టార్టప్ ఎంట్రప్రెన్యూర్స్ నుంచి విశేష స్పందన లభించింది. ప్రస్తుతం ఏఐ యుగంలో మెధాజెన్ ఏఐ స్మార్ట్ ఆసుపత్రుల నిర్మాణానికి, ఆరోగ్య నిపుణుల సాధికారతకు, డేటా ఆధారిత, రోగి కేంద్రిత వైద్య భవిష్యత్తు రూపకల్పనకు బలమైన పునాది వేసింది.




# 18 రోజులు సినిమా చూపించారు



తాడేపల్లి, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): మూడు కేసులకు సంబంధించి 18 రోజుల పాటు మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ మూడు కేసుల్లో బెయిల్ మంజూరు కావడంతో ఆయన జైలు నుంచి బయటకు వచ్చారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పై మండిపడ్డారు. "24 గంటల్లో సినిమా చూపిస్తానన్నావ్... 18 రోజులు సినిమా చూపించావు. ఇందులో ఎవరు హీరో? నేనే హీరో. మీరు విలన్లు అయ్యారు" అని అన్నారు. 'ఇరవై రోజులుగా ఎన్నో జరిగాయి. ఏం జరిగిందో ప్రజలు అర్థం చేసుకున్నారు. జనవరి 31 అర్ధరాత్రి నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. కోర్టు బెయిల్ ఇవ్వడంతో మొన్న విడుదల అయ్యాను. ఈ 18 రోజులు మాట్లాడే అవకాశమే రాలేదు. నా కూతురు అందరికీ అర్థమయ్యేలా అన్ని విషయాలు చెప్పింది. టీడీపీ కట్టిన ఫ్లెక్సీ వద్దకు వెళ్లి మంచి పద్ధతి కాదని చెప్పే ప్రయత్నం చేశాను. ఫ్లెక్సీని నేను చించివేయలేదు. మరుసటి రోజు గుళ్లలో పూజలు చెయ్యమని పార్టీ నుంచి సమాచారం వచ్చింది. పర్మిషన్ తీసుకుని అక్కడకు వెళ్లాను. తిరిగి వస్తుంటే కారు అడ్డుకుని అమ్మ, అక్క అంటూ బూతులు తిట్టారు. ఆ తర్వాతే నేను కూడా తిట్టాను. తర్వాత ఇంటికొచ్చి ఆలోచిస్తే నా అంతరాత్మ ఒప్పుకోలేదు. నేను అన్న మాటలు చంద్రబాబును ఉద్దేశించి కాదు. ఇంటికి వచ్చిన తర్వాత పశ్చాత్తాపానికి గురయ్యాను. ఐదు గంటలకు ఇంటివద్దకు పలు నియోజకవర్గాల నుంచి భారీగా జనం వచ్చారు. నా కుటుంబ సభ్యులు, మనవళ్లు ఇంట్లో ఉన్నారు. ఏడు గంటలపాటు టీడీపీ గూండాలు రచ్చ చేశారు. ఇంటిపై దాడి చేసిన వారంతా కమ్మవారే. పోలీసుల అండతో రెచ్చిపోయారు. ఎక్కడైనా పోలీసులు, గూండాలు ఒక్కటవుతారా? వైసీపీ వారిని మా ఇంటి వద్దకు రానివ్వకుండా పోలీసులు అడ్డుకున్నారు. పారిపోవాలని సీఐ గంగా వెంకటేశ్వర్లు నాతో చెప్పారు. పారిపోవడం కన్నా చచ్చిపోవడం మేలని నేను చెప్పాను. పోలీసులు నన్ను తీసుకెళ్లి లాకప్ లో పెట్టారు. రాత్రి 2 గంటలకు స్టేషన్ పైకి తీసుకెళ్లి నన్ను కొట్టడానికి ప్రయత్నించారు. కానీ కొట్టలేదు. నన్ను కొట్టడానికి ప్రయత్నించడంపై న్యాయపోరాటం చేస్తా. నల్లపాడు సీఐ వంశీ రిమాండ్ రిపోర్ట్ లో... "కమ్మ నా కొడకల్లారా" అని తిట్టానని రాశాడు. నా ఇద్దరు అల్లుళ్లు కమ్మవారే. కులాల పేరుతో రెచ్చగొడుతున్నది మీరే. పెమ్మసాని చంద్రశేఖర్ మూల్యం చెల్లించే రోజు వస్తుంది. తప్పక మూల్యం చెల్లించాల్సిందే. పోలీసులతో హత్యలు చేయించడం చంద్రబాబుకు అలవాటే. ఆ అలవాటు నారా లోకేశ్ కి వచ్చింది. నేను కమ్మ వ్యతిరేకిని కాదు. నన్ను నిర్మూలించాలని రెడ్ బుక్ లో రాసుకున్నారట. చంద్రబాబు కమ్మని ప్రభుత్వానికి పవన్ కల్యాణ్ కాపుకాస్తున్నాడు. వంగవీటి రంగాను కోల్పోయాం. ముద్రగడను కోల్పోవడానికి సిద్ధంగా లేం' అని పేర్కొన్నారు.



# తిరుమల లడ్డూ కల్తీపై ఏకసభ్య కమిషన్

**45 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**

విజయవాడ, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ వ్యవహారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ కుంభకోణంపై లోతైన విచారణ జరిపేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి దినేశ్‌కుమార్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను నియమించింది. విచారణను 45 రోజుల్లో పూర్తి చేసి, ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు. కోట్లాది భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ సున్నితమైన అంశంలో అసలు నిజాలను నిగ్గు తేల్చేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. లడ్డూ కల్తీ వెనుక ఉన్న అసలు సూత్రధారులు, బాధ్యులను గుర్తించడమే లక్ష్యంగా ఈ కమిషన్ పనిచేయనుంది. ఈ వ్యవహారంపై గతంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఒక నివేదికను సమర్పించింది. అయితే, సిట్ నివేదికలోని కొన్ని అంశాలపై మరింత స్పష్టత అవసరమని, కుట్ర వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులను గుర్తించాల్సి ఉందని ప్రభుత్వం భావించింది. ఈ నేపథ్యంలోనే లోతైన దర్యాప్తు కోసం ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా భక్తుల్లో ఆందోళన రేకెత్తించిన ఈ ఘటనపై పారదర్శక విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షిస్తామని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నారు.

# హిందూపురంలో బాలకృష్ణ సొంతిల్లు

**ఇంటి నిర్మాణానికి నటసింహం భూమిపూజ**

**భార్య వసుంధరతో కలిసి హాజరు**

హిందూపురం, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): ప్రముఖ సినీ నటుడు, హిందూపురం టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తన నియోజకవర్గంలో సొంత ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురంలోని వనం కాలనీలో శుక్రవారం ఆయన సతీమణి వసుంధరతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంతో ఆయన హిందూపురంలోనే శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోబోతున్నట్లు స్పష్టమైంది. హిందూపురం నుంచి 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన బాలకృష్ణ, ఇప్పటివరకు హైదరాబాద్‌లో ఉంటూ నియోజకవర్గ కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్నారు. దీంతో, ఆయన నియోజకవర్గానికి అందుబాటులో ఉండటం లేదంటూ ప్రతిపక్షాల నుంచి తరచూ విమర్శలు వస్తున్నాయి. ఈ విమర్శలకు చెక్ పెట్టే ఉద్దేశంతోనే బాలకృష్ణ ఈ నిర్ణయం తీసుకున్నట్లు రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. హిందూపురం పట్టణ సమీపంలోని వనం కాలనీలో 81 సెంట్ల విస్తీర్ణంలో ఈ ఇంటిని నిర్మించనున్నారు. భూమిపూజకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ సందర్భంగా, ఇకపై హిందూపురమే తన కేరాఫ్ అడ్రస్ అవుతుందని బాలకృష్ణ తన సన్నిహితులతో అన్నట్లు సమాచారం. సొంత ఇంటి నిర్మాణంతో నియోజకవర్గ ప్రజలకు మరింత చేరువ కావాలని, వారితో మమేకం కావాలని ఆయన భావిస్తున్నారు.






# హైదరాబాద్‌లోని చట్నీస్ హోటల్‌లో భారీ పేలుడు

ఎల్బీనగర్–హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని ఓ హోటల్లో భారీ పేలుడు సంభవించింది. అధిక వేడి కారణంగా ఇడ్లీ స్టీమర్ పేలిపోయినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఎల్బీనగర్‌లోని ఆర్కేపురం చట్నీస్ హోటల్‌లో మధ్యాహ్నం పేలుడు జరిగింది. ఒక్కసారిగా భారీ శబ్ధంతో పేలుడు చోటు చోసుకోవడంతో హోటల్ సిబ్బంది, కస్టమర్లు బయటకు పరుగు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. పోలీసులు, హైడ్రా సిబ్బంది, బాంబు స్క్వాడ్ బృందాలు కిచెన్‌ను పరిశీలించాయి.




# ఏప్రిల్ 1 నుంచి నగదు టోల్ బంద్

న్యూఢిల్లీ: జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఇది అత్యంత కీలకమైన అప్‌డేట్. దేశవ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాల్లో నగదు రూపంలో రుసుము చెల్లించే విధానానికి స్వస్తి పలకాలని కేంద్ర ప్రభుత్వం గట్టిగా యోచిస్తోంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే, 2026 ఏప్రిల్ 1వ తేదీ నుంచి టోల్ ప్లాజాల వద్ద నగదు చెల్లింపులు పూర్తిగా రద్దు కానున్నాయి. ఆ తర్వాత టోల్ రుసుములను కేవలం ఫాస్టాగ్ లేదా యూపీఐ వంటి డిజిటల్ మార్గాల ద్వారానే చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ సంకేతాలు ఇచ్చింది. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, టోలింగ్ ప్రక్రియను అత్యంత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చడమే ఈ ప్రతిపాదన ముఖ్య ఉద్దేశమని ప్రభుత్వం స్పష్టం చేసింది. గత కొన్నేళ్లుగా ఫాస్టాగ్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 98 శాతానికి పైగా వాహనదారులు ఫాస్టాగ్ ద్వారానే టోల్ చెల్లిస్తున్నారు. ఈ విజయమే నగదు రహిత విధానం వైపు అడుగులు వేయడానికి ప్రభుత్వానికి ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చింది. ఫాస్టాగ్‌తో పాటు, దేశంలోని అన్ని టోల్ ప్లాజాల్లో యూపీఐ ద్వారా చెల్లించే సౌకర్యం కూడా అందుబాటులో ఉంది. ఇది ప్రయాణికులకు తక్షణ చెల్లింపునకు మరో మార్గాన్ని అందిస్తోంది. ప్రస్తుతం, వాహనం విండ్‌స్క్రీన్‌పై అతికించిన ఫాస్టాగ్ స్టిక్కర్ ద్వారా టోల్ ప్లాజా వద్ద ఆగకుండానే రుసుము ఆటోమేటిక్‌గా ఖాతా నుంచి కట్ అవుతోంది. ఈ విధానం దేశంలోని అన్ని జాతీయ రహదారులతో పాటు, 100కి పైగా రాష్ట్ర రహదారుల టోల్ ప్లాజాల్లో విజయవంతంగా అమలవుతోంది. ఇప్పటికే ప్రభుత్వం డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఫంక్షనల్ ఫాస్టాగ్ ఉండి కూడా నగదు చెల్లిస్తే రెట్టింపు రుసుము, యూపీఐ ద్వారా చెల్లిస్తే 1.25 రెట్లు రుసుము వసూలు చేస్తున్నారు. తాజా ప్రతిపాదన అమలైతే, టోల్ ప్లాజాల వద్ద వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌లు గణనీయంగా తగ్గుతాయి. ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవుతుంది. టోల్ ఆపరేటర్లకు నిర్వహణ ఖర్చులు తగ్గడంతో పాటు, టోల్ వసూళ్లలో ఆడిట్ నియంత్రణ మరింత సులభతరం అవుతుంది. నగదుపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించి, టోలింగ్ వ్యవస్థను 100 శాతం డిజిటలైజ్ చేయడమే లక్ష్యమని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ తెలిపింది. ఈ ప్రతిపాదనకు ఆమోదముద్ర పడితే, 2026 ఏప్రిల్ నుంచి జాతీయ రహదారులపై ప్రయాణం పూర్తిగా క్యాష్‌లెస్ అనుభవంగా మారనుంది.

## డ్రోన్, జీపీఎస్ జామర్ల అమ్మకంపై సీరియస్

### 6 ఈ-కామర్స్ సంస్థలకు కేంద్రం నోటీసులు

న్యూఢిల్లీ: దేశంలో నిబంధనలకు విరుద్ధంగా డ్రోన్ జామర్లు, ఇతర వైర్‌లెస్ పరికరాలను ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్న ఆరు ఈ-కామర్స్ సంస్థలకు కేంద్ర వినియోగదారుల పరిరక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రభుత్వ అనుమతి లేకుండా డ్రోన్ జామర్లు, జీపీఎస్ జామర్లు, యాంటీ-డ్రోన్ సిస్టమ్స్ వంటి నిషేధిత పరికరాలను విక్రయించడంపై సీసీపీఏ తీవ్రంగా స్పందించింది. నోటీసులు అందుకున్న సంస్థలలో ఎవర్‌సే, ఇండియామార్ట్, ఎక్స్‌బూమ్, జావియట్ ఏరోస్పేస్, ఎయిర్‌వన్ రోబోటిక్స్, మావెరిక్ డ్రోన్స్ ఢ టెక్నాలజీస్ ఉన్నాయి. ఈ సంస్థలు వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019తో పాటు, టెలికాం, వాణిజ్య నియంత్రణ చట్టాలను ఉల్లంఘించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇండియన్ టెలిగ్రాఫ్ యాక్ట్-1885, వైర్‌లెస్ టెలిగ్రఫీ యాక్ట్-1933 ప్రకారం డ్రోన్ జామర్లు, సిగ్నల్ జామింగ్ పరికరాల అమ్మకాలపై కఠినమైన నియంత్రణలు ఉన్నాయి. టెలికాం విభాగం, వైర్‌లెస్ ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ నుంచి తప్పనిసరిగా లైసెన్సులు పొందాల్సి ఉంటుంది. కేవలం ప్రభుత్వ ఏజెన్సీలు, శాంతిభద్రతల పరిరక్షణ సంస్థలకు మాత్రమే వీటిని కొనుగోలు చేసే అధికారం ఉంటుంది. ఈ నేపథ్యంలో, గత రెండేళ్లలో ఎన్ని యూనిట్లు విక్రయించారు, వాటిని ఎక్కడ నుంచి సేకరించారు, దిగుమతి లైసెన్సులు, కొనుగోలుదారుల పూర్తి వివరాలు సమర్పించాలని సీసీపీఏ ఆ సంస్థలను ఆదేశించింది. ఈ-కామర్స్ నిబంధనల ప్రకారం, తమ ప్లాట్‌ఫామ్‌లపై చట్టవిరుద్ధమైన వస్తువుల అమ్మకాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయా సంస్థలదేనని, దీన్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కేంద్రం స్పష్టం చేసింది.

## స్టాలిన్‌తో పన్నీర్ సెల్వం భేటీ

### ఎన్నికల వేళ ఆసక్తికర పరిణామం

చెన్నై: తమిళనాడులో ఎన్నికలకు సమయం దగ్గరపడుతోంది. ఈ క్రమంలో రోజురోజుకీ ఆ రాష్ట్రంలో రాజకీయ ముఖచిత్రం మారిపోతోంది. ఇప్పటివరకు డీఎంకే, అన్నాడీఎంకే మధ్య ద్విముఖ పోరు మాత్రమే ఉండేది. ఇప్పుడు సినీ నటుడు విజయ్ రాజకీయ ఆరంగేట్రంతో ఈ పోరు త్రిముఖ పోటీగా మారింది. తాజాగా మరో ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. మాజీ ముఖ్యమంత్రి పన్నీర్ సెల్వంను అన్నాడీఎంకే నుంచి బహిష్కరించిన సంగతి తెలిసిందే. ఈరోజు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత స్టాలిన్‌ను పన్నీర్ సెల్వం కలిశారు. స్టాలిన్, పన్నీర్ సెల్వం కలయిక తమిళనాట సంచలనం రేపుతోంది. డీఎంకేలోకి పన్నీర్ సెల్వం చేరికకు సర్వం సిద్ధమైందని తెలుస్తోంది. దీనికి సంబంధించే వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. ఈ చర్చల్లో డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్, పన్నీర్ సెల్వం కుమారుడు కూడా పాల్గొన్నారు. ఇప్పటికే డీఎంకే నేతృత్వంలోని కూటమిలో దివంగత విజయకాంత్ పార్టీ డీఎండీకే చేరిన విషయం గమనార్హం. మరోవైపు, వీరి సమావేశం జరిగిన తర్వాత అన్నాడీఎంకే ఎమ్మెల్యే అయ్యప్పన్ అసెంబ్లీలో సంచలన వ్యాఖ్యలు చేశారు.

# ఏఐ సమ్మిట్‌లో అర్ధనగ్న నిరసన


**యూత్ కాంగ్రెస్ నేతల నిర్వాకం.. ఇది సిగ్గులేని చర్య అన్న బీజేపీ.. రాజ్యాంగ హక్కని కాంగ్రెస్ సమర్థన**




న్యూఢిల్లీ: ఢిల్లీలో జరుగుతున్న 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026'లో యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేపట్టిన నిరసన తీవ్ర రాజకీయ దుమారం రేపింది. అమెరికాతో కేంద్ర ప్రభుత్వం కుదుర్చుకుంటున్నట్లుగా వార్తలు వస్తున్న వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ పలువురు యూత్ కాంగ్రెస్ నేతలు షర్ట్‌లు విప్పి ప్రదర్శన చేశారు. ఈ ఘటనతో కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం మొదలైంది. ఈ నిరసనను కాంగ్రెస్ పార్టీ గట్టిగా సమర్థించుకుంది. "దేశంలోని యువత, రైతులు, వ్యాపారుల ఆగ్రహాన్ని యూత్ కాంగ్రెస్ సహచరులు తమ నిరసన రూపంలో వ్యక్తం చేశారు" అని 'ఎక్స్' సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. "అమెరికాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవడం ద్వారా నరేంద్ర మోదీ మన యువత, రైతులు, వ్యాపారుల ప్రయోజనాలపై దాడి చేశారు. దేశాన్ని అమెరికాకు తాకట్టు పెట్టారు" అని తీవ్ర ఆరోపణలు చేసింది. నిరసన తెలిపే హక్కు రాజ్యాంగం కల్పించిందని, ప్రజల గొంతుకను వినిపిస్తామని పేర్కొంది. కాంగ్రెస్ నిరసనపై బీజేపీ తీవ్రంగా మండిపడింది. అంతర్జాతీయ సదస్సుకు అంతరాయం కలిగించినందుకు కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా ఈ నిరసనను "చొక్కాలు లేని, బుర్ర లేని, సిగ్గులేని చర్య"గా అభివర్ణించారు. ఇది దేశానికి అవమానకరమని, భారత్ అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నమని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్, సుందర్ పిచాయ్ వంటి అంతర్జాతీయ ప్రముఖులు హాజరైన సదస్సులో ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. ఈ వివాదంపై కేంద్ర ప్రభుత్వం స్పందిస్తూ, రైతు ప్రయోజనాలకే తమ తొలి ప్రాధాన్యత అని, ఈ విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేసింది. ఒప్పందం పూర్తి వివరాలు వచ్చే నెలలో వెల్లడవుతాయని తెలిపింది. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న యూత్ కాంగ్రెస్ నాయకులు క్యూఆర్ కోడ్‌లతో భారత్ మండపంలోకి ప్రవేశించి ఈ నిరసన చేపట్టారు.

# రాహుల్ కనుసన్నల్లోనే..!

### అర్ధనగ్న ప్రదర్శనపై కిషన్ రెడ్డి, బండి ఫైర్



న్యూఢిల్లీ: ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' వద్ద యూత్ కాంగ్రెస్ కార్యకర్తలుగా భావిస్తున్న కొందరు చొక్కాలు విప్పి నిరసన తెలపడం తీవ్ర దుమారానికి దారి తీసింది. ఈ ఘటనపై తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దర్శకత్వంలోనే ఈ నిరసన జరిగిందని, ఇది ఆయన చౌకబారు రాజకీయాలకు నిదర్శనమని వారు మండిపడ్డారు. ఈ ఘటనపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "భారత్ ఏఐ సదస్సు ద్వారా స్పష్టమైన, గణనీయమైన ఫలితాలను అందుకుంటున్న తరుణంలో, రాహుల్ గాంధీ చౌకబారు రాజకీయాలు, హేయమైన చర్యలు, సిగ్గుమాలిన ప్రవర్తనను తీవ్రంగా ఖండించాలి. రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలు గూండాలు, పోకిరీల్లా చొక్కాలు లేకుండా తిరుగుతూ సదస్సుకు అంతరాయం కలిగించారు. ఇది మన యువతలోని స్ఫూర్తిని, పారిశ్రామిక స్ఫూర్తిని దారుణంగా అవమానించడమే. యువతను ప్రోత్సహించాల్సింది పోయి, రాహుల్ గాంధీ వారిలో నిరాశ, నిస్పృహలను నింపుతున్నారు" అని కిషన్ రెడ్డి విమర్శించారు. రాహుల్ గాంధీ ఏ చర్యలోనూ దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వలేదని, ప్రతి వేదికనూ దేశ పురోగతిని కించపరిచేందుకే వాడుకుంటున్నారని ఆరోపించారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సైతం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టారు. "కాంగ్రెస్‌కు పూర్తిగా పిచ్చి పట్టింది. సిగ్గులేని ద్వంద్వ క్రీడ ఇది. ఏఐ సదస్సులో రాహుల్ గాంధీ దర్శకత్వంలో కాంగ్రెస్ గందరగోళం సృష్టిస్తూ చొక్కాలు విప్పి నిరసనల పేరుతో చౌకబారు నాటకాలు ఆడుతోంది" అని ఆయన మండిపడ్డారు. అదే సమయంలో, సదస్సు వేదిక లోపల అదే కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ప్రపంచంలోని మేధావులను ఒకేచోటకు చేర్చినందుకు ప్రధాని మోదీని అభినందిస్తున్నారని బండి సంజయ్ గుర్తుచేశారు. "ఒకే పార్టీ, రెండు ముఖాలు, సున్నా గౌరవం. ఇది ప్రతిపక్షం తీరు కాదు, దేశాన్ని అవమానించడమే. ఇది రాజకీయ స్కిజోఫ్రెనియా. ప్రపంచ వేదికపై మువ్వన్నెల జెండా రెపరెపలాడుతున్నప్పుడు, గేటు వద్ద ఇలాంటి చౌకబారు రాజకీయాలు చేయకూడదు. ఎల్లప్పుడూ దేశానికే ప్రథమ ప్రాధాన్యత" అని బండి సంజయ్ తన పోస్టులో పేర్కొన్నారు. ప్రధాని మోదీకి, ప్రతిపాదిత భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందానికి వ్యతిరేకంగా ఈ నిరసన నిర్వహించారు. ఈ ఒప్పందం దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసేలా ఉందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రులు చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి.

# బంగారాన్ని చెత్త అనుకున్నారు!

### అమ్మేసిన ఓ కుటుంబం

నిజాయితీతో తిరిగి ఇచ్చిన స్క్రాప్ డీలర్

ఫరీదాబాద్: హర్యానాలోని ఫరీదాబాద్‌కు చెందిన స్క్రాప్ డీలర్ అనుకోకుండా తన వద్దకు వచ్చిన రూ.15 లక్షల విలువైన బంగారాన్ని తిరిగి అప్పగించి తన మంచి మనసును చాటుకున్నాడు. దీపావళి పండుగ సందర్భంగా నగరానికి చెందిన అశోక్ తన ఇంటిని మొత్తం శుభ్రం చేసి చెత్తను స్థానిక స్క్రాప్ డీలర్ హాజీ అక్తర్‌కు విక్రయించాడు. అనుకోకుండా ఈ చెత్తలోనే 10 తులాల బంగారం వెళ్లింది. దీనిని అశోక్, స్క్రాప్ కొనుగోలుదారు ఎవరూ గుర్తించలేదు. కొన్ని రోజుల తర్వాత ఇంట్లో బంగారం కనిపించకపోవడంతో అశోక్ కుటుంబం స్క్రాప్ డీలర్‌ను సంప్రదించింది. వారు ఎంతగా వెతికినా బంగారం దొరకకపోవడంతో అశోక్ కుటుంబం నిరాశపడింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇటీవల స్క్రాప్ డీలర్ చెత్తను వేరు చేస్తున్న సమయంలో స్క్రాప్ డీలర్ బంగారు ఆభరణాలను గుర్తించాడు. వెంటనే వాటిని స్థానిక పోలీసులకు అప్పగించాడు. అలాగే బంగారు ఆభరణాలను పోగొట్టుకున్న అశోక్ గురించి పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు అశోక్ కుటుంబాన్ని పిలిపించి ఆ బంగారు ఆభరణాలను అప్పగించారు.



# బ్యూటీ విత్ డ్రగ్స్!

### పగలు బ్యూటీ పార్లర్.. రాత్రి డ్రగ్స్ దందా.. పట్టుబడ్డ లేడీ డాన్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో మరో 'లేడీ డాన్' గుట్టురట్టయింది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో సంబంధాలున్న ఖుస్నుమా అన్సారీ అలియాస్ నేహాను పోలీసులు అరెస్టు చేశారు. పగలు బ్యూటీ పార్లర్ నడుపుతూ, రాత్రిపూట డ్రగ్స్ సిండికేట్‌ను శాసిస్తున్న ఈమెను గ్యాంగ్‌స్టర్లు 'మేడమ్ జహర్' (అందమైన విషం) అని పిలుచుకుంటారు. ఇటీవల మహిపాల్‌పూర్ ఫ్లైఓవర్ వద్ద భారీగా డ్రగ్స్ పట్టుబడిన కేసు దర్యాప్తులో పోలీసులకు 'మేడమ్ జహర్' పేరు పదేపదే వినిపించింది. దీనిపై లోతుగా విచారణ జరపగా... ఈశాన్య దిల్లీలో బ్యూటీ పార్లర్ నడుపుతున్న ఖుస్నుమానే ఆ లేడీ డాన్ అని తేలింది. బ్యూటీ పార్లర్‌ను అడ్డం పెట్టుకుని ఆమె ఈ అక్రమ వ్యాపారాన్ని ఏళ్లుగా కొనసాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఖుస్నుమాకు లారెన్స్ బిష్ణోయ్, హషీమ్ బాబా ముఠాలకు ఆయుధాలు సరఫరా చేసే బాబీ కబూతర్ అలియాస్ మహ్‌ఫూజ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పాకిస్థాన్ ఐఎస్ఐతో సంబంధమున్న ఆయుధాల డీలర్ సలీమ్ పిస్టల్ నుంచి బాబీ ఆయుధాలు సేకరిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య, నటి దిశా పటానీ ఇంటిపై కాల్పుల ఘటనల్లో బాబీ సరఫరా చేసిన ఆయుధాలనే వాడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. పక్కా సమాచారంతో దిల్లీ పోలీసుల స్పెషల్ సెల్ విభాగం ఖుస్నుమా, బాబీ కబూతర్‌తో పాటు మరో ఇద్దరిని అరెస్టు చేసింది. ఈ ముఠా ఆర్థిక మూలాలపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలోనూ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన లేడీ డాన్‌లు దీప, జోయా ఖాన్‌లను పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

## స్టాలిన్ నా సభకు రావాలి

### లేదంటే మాజీ సీఎం అవుతారు.. కేఏ పాల్ హెచ్చరిక



చెన్నై: ప్రముఖ శాంతి ప్రబోధకుడు, ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు బహిరంగ హెచ్చరిక జారీ చేశారు. చెన్నైలో తాను నిర్వహించనున్న గ్లోబల్ పీస్ ఫెస్టివల్‌కు హాజరుకాకపోతే, రాబోయే ఎన్నికల్లో స్టాలిన్ మాజీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని అన్నారు. గతంలో దివంగత సీఎం జయలలితకు ఇదే అనుభవం ఎదురైందని ఆయన గుర్తుచేశారు. వివరాల్లోకి వెళితే.. ఫిబ్రవరి 22, ఆదివారం సాయంత్రం 5 గంటలకు చెన్నైలోని వైఎంసీఏ గ్రౌండ్స్‌లో గ్లోబల్ పీస్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు కేఏ పాల్ శుక్రవారం మీడియాకు తెలిపారు. ఈ సభకు 48 గంటల్లోగా అనుమతి ఇవ్వాలని బుధవారం ప్రభుత్వాన్ని కోరానని, చెప్పినట్టుగానే గడువులోగా అనుమతులు మంజూరు చేసినందుకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సీఎం స్టాలిన్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఇది రాజకీయ సభ కాదని, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దలతో పాటు వేలాది మంది యువత పాల్గొనే ప్రపంచ శాంతి సభ అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా 200 దేశాల్లో ఇది ప్రసారం అవుతుందని తెలిపారు. శాంతి, ఐక్యతకు మద్దతుగా సీఎం స్టాలిన్ ఈ కార్యక్రమానికి హాజరుకావాలని, కనీసం రాత్రి 7 నుంచి 9 గంటల మధ్యలో కొద్దిసేపైనా వచ్చి శాంతికి సంఘీభావం తెలపాలని కోరారు. అనంతరం పాల్ గతాన్ని గుర్తుచేస్తూ, "2002లో జయలలిత నా శాంతి సభకు హాజరుకాలేదు. దీంతో ఆమెను ఓడించాలని నా అనుచరులకు పిలుపునిచ్చాను. ఫలితంగా 2004 ఎన్నికల్లో ఆమె పార్టీ 38 ఎంపీ స్థానాల్లో ఓడిపోయింది. ఆ తర్వాత జయలలిత నన్ను ఆహ్వానించి మద్దతు కోరగా, 2014లో ఆమె గెలిచారు. ఇప్పుడు స్టాలిన్ కూడా ఈ శాంతి సభను తిరస్కరిస్తే, మే 2026 ఎన్నికల తర్వాత ఆయన కూడా మాజీ సీఎం అవుతారు" అని హెచ్చరించారు. శాంతిని, ప్రజలను గౌరవించడం ద్వారానే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పాల్ వ్యాఖ్యానించారు.

## 33 మంది బాలలపై లైంగిక దాడి

### యూపీలో ఇంజినీర్ దంపతులకు మరణశిక్ష

లక్నో: కిరాతకమైన, హేయమైన నేరానికి పాల్పడిన ప్రభుత్వ అధికారికి, ఆయన భార్యకు కోర్టు మరణశిక్ష విధించింది. దాదాపు 33 మంది చిన్నారులపై (అందరూ అబ్బాయిలే) దశాబ్ద కాలంగా లైంగిక దాడులకు పాల్పడిన కేసులో ఉత్తరప్రదేశ్‌లోని బాందా ప్రత్యేక పోక్సో కోర్టు ఈ సంచలన తీర్పు వెలువరించింది. ఈ కేసును "అరుదైన వాటిలో అత్యంత అరుదైనది"గా అభివర్ణించిన న్యాయస్థానం, నిందితులకు కఠిన శిక్ష విధించడం ద్వారానే న్యాయం జరుగుతుందని స్పష్టం చేసింది. వివరాల్లోకి వెళితే, యూపీ నీటిపారుదల శాఖలో జూనియర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న రాంభవన్, ఆయన భార్య దుర్గావతి సుమారు 2010 నుంచి 2020 వరకు బాందా, చిత్రకూట్ జిల్లాల్లో ఈ ఘాతుకాలకు పాల్పడ్డారు. ఆన్‌లైన్ వీడియో గేమ్స్, డబ్బు, బహుమతులు ఆశ చూపి చిన్నారులను లొంగదీసుకుని వారిపై లైంగిక దాడి చేసేవారు. ఈ క్రమంలో వారితో అశ్లీల వీడియోలు చిత్రీకరించి, వాటిని ఇంటర్నెట్‌లో ప్రసారం చేసినట్లు సీబీఐ దర్యాప్తులో తేలింది. బాధితుల్లో మూడేళ్ల పసిపిల్లలు కూడా ఉండటం ఈ నేర తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ కేసు విచారణ చేపట్టిన సీబీఐ, 2020 అక్టోబర్ 31న కేసు నమోదు చేసి, 2021 ఫిబ్రవరి 10న రాంభవన్ దంపతులపై ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఐపీసీ, పోక్సో చట్టంలోని పలు కఠిన సెక్షన్ల కింద వీరిని దోషులుగా నిర్ధారిస్తూ శుక్రవారం కోర్టు తీర్పు ఇచ్చింది. నిందితుల నైతిక పతనం, నేరాల తీవ్రత దృష్ట్యా వారికి పశ్చాత్తాపపడే అవకాశం కూడా ఇవ్వరాదని, అత్యున్నత శిక్ష మాత్రమే సరైనదని న్యాయమూర్తి తన తీర్పులో పేర్కొన్నారు. నిందితుల లైంగిక దాడిలో తీవ్రంగా గాయపడిన కొందరు చిన్నారులు ఆసుపత్రిలో చికిత్స పొందగా, మరికొందరికి మెల్లకన్ను వంటి సమస్యలు తలెత్తాయి. చాలామంది ఇప్పటికీ మానసిక వేదన అనుభవిస్తున్నారని సీబీఐ తెలిపింది. ఈ కేసులో బాధితులందరికీ ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తలా రూ.10 లక్షల చొప్పున పరిహారం అందించాలని కోర్టు ఆదేశించింది. నిందితుల ఇంటి నుంచి స్వాధీనం చేసుకున్న నగదును కూడా బాధితులకు సమానంగా పంచాలని సూచించింది. దర్యాప్తు సమయంలో బాధితులైన చిన్నారుల పట్ల సీబీఐ అధికారులు అత్యంత సున్నితంగా వ్యవహరించారని, వారికి కౌన్సిలింగ్ ఇప్పించి వారి మానసిక స్థైర్యాన్ని కాపాడారని సీబీఐ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఫోరెన్సిక్ నిపుణులు, వైద్య నిపుణులతో సమన్వయం చేసుకుంటూ డిజిటల్ ఆధారాలను పకడ్బందీగా సేకరించినట్లు తెలిపింది.


## మార్కెట్లకు లాభాల కళ

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం భారీ లాభాలతో ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, మెటల్ రంగ షేర్లలో బలమైన కొనుగోళ్లు జరగడంతో సూచీలు రాణించాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 316 పాయింట్లు లాభపడి 82,814 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 116 పాయింట్లు పెరిగి 25,571 వద్ద ముగిసింది. రంగాల వారీగా చూస్తే, ఐటీ, మీడియా మినహా మిగిలినవన్నీ లాభాల్లో ముగిశాయి. నిఫ్టీ ఐటీ సూచీ 0.98 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్ సూచీ 1.68 శాతం, మెటల్ సూచీ 1.25 శాతం చొప్పున లాభపడ్డాయి. పవర్, క్యాపిటల్ గూడ్స్, ఎఫ్ఎంసీజీ స్టాక్స్‌లో కూడా కొనుగోళ్ల ఆసక్తి కనిపించింది. అయితే, మార్కెట్ బ్రెడ్త్ మాత్రం ప్రతికూలంగా ఉంది. 2,043 షేర్లు లాభపడగా, 2,511 షేర్లు నష్టాల్లో ముగిశాయి. రోజు ప్రారంభంలో ఒడుదొడుకులకు లోనైనప్పటికీ, తక్కువ స్థాయిల వద్ద నాణ్యమైన షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడంతో మార్కెట్లు పుంజుకున్నాయని విశ్లేషకులు తెలిపారు. అమెరికా-ఇరాన్ మధ్య భౌగోళిక ఉద్రిక్తతలు, మిశ్రమ అంతర్జాతీయ సంకేతాల కారణంగా సమీప భవిష్యత్తులో మార్కెట్ కొంత రేంజ్-బౌండ్‌లోనే ఉండవచ్చని వారు అంచనా వేస్తున్నారు. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 0.02 శాతం బలపడి 90.99 వద్ద ముగిసింది. బ్యాంక్ నిఫ్టీ కీలకమైన 61,200 స్థాయి పైన ముగియడం సానుకూల సంకేతమని, 61,000 స్థాయి కీలక మద్దతుగా, 61,350-61,400 స్థాయి తక్షణ నిరోధకంగా పనిచేయవచ్చని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడ్డారు.

వయ్యారి చిత్రం



## కీర్తి .. తగ్గట్లే!



టాలీవుడ్ లో కీర్తి సురేష్ జర్నీ ఎలా ప్రారంభమై ఎలాంటి టర్నింగ్ లు తీసుకుందో చెప్పాల్సిన పనిలేదు. -మహానటి- తర్వాత కెరీర్ ఒకలా సాగుతుందనుకుంటే? అందుకు భిన్నంగా ప్రయాణం మందుకు సాగింది. కేవలం డీసెంట్ పాత్రలతో ప్రేక్షకులకు దగ్గరవ్వాలనుకున్న అమ్మడి స్ట్రాటజీ కొంత వరకూ వర్కౌట్ అయింది. కానీ ఇలాగే కొనసాగితే మొదటికే ముప్పు వస్తుందని భావించిన అమ్మడు ఒక్కసారిగా ట్రాక్ మార్చేసింది. వడి వడిగా గ్లామర్ పాత్రల వైపు అడుగులు వేసింది. అదే సమయంలో వివాహం అవ్వడం కలిసొచ్చింది. అప్పటికే పెళ్లైన భామలకు ఇండస్ట్రీలో డిమాండ్ ఏర్పడటంతో? కీర్తి సురేష్ కి కూడా అవకాశాలు మెరుగు పడ్డాయి. మునుపటి కంటే కొత్త అవకాశాలు అందుకోవడంలో వేగం పుంజుకుంది. 2024 లో నాలుగు సినిమాలతో ప్రేక్షకుల మధ్యలోనే ఉంది. అటుపై ఏడాది రెండు సినిమాలతో అలరించింది. ఇదే సమయంలో బాలీవుడ్ ఎంట్రీ కూడా జరిగిపోయింది. అయితే డెబ్యూ అక్కడ ఆశించిన ఫలితాలు సాధించలేదు. అలాగని నటించిన సినిమాలన్నీ విజయం సాధించాయా? అంటే అదీ జరగలేదు. తన పాత్ర వరకూ న్యాయం చేసినా ఫైనల్ ఔట్ పుట్ ప్రేక్షకుల్ని నిరాశ పరిచింది. ఇందులో కీర్తి తప్పిందం ఎక్కడా కనిపించలేదు. తాజాగా అమ్మడి కిట్టీలో చాలా ప్రాజెక్ట్ లు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం తమిళ్ లో -కన్నెవేడి- అనే చిత్రంలో నటిస్తోంది. మలయాళంలో -తొట్టమ్- అనే మరో చిత్రంలోనూ నటిస్తోంది. తెలుగులో -రౌడీ జనార్దన- తోనూ బిజీగా ఉంది. ఇవి గాక వెంకటేష్ హీరోగా అనీల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కనున్న చిత్రంలోనూ ఈ భామనే హీరోయిన్ గా పరిశీలిస్తున్నారు. ఇంత వరకూ ఈ జోడీ వెండి తెరపై కనిపించలేదు. ఈ నేపథ్యంలో ఆజోడీపై ఆసక్తి నెలకొంది. అలాగే -మహేంద్రగిరి వానర-లోనూ అతిథి పాత్రలో నటిస్తోంది. తాజాగా కోలీవుడ్ లో మరో రెండు ప్రాజెక్ట్ లకు సైన్ చేసినట్లు సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది. అలాగే హిందీలో కూడా ఓ సినిమాకు కమిట్ అయిందని ప్రచారం జరుగుతోంది. మాలీవుడ్ లో కూడా ఓ సీనియర్ స్టార్ కు జోడీగా నటిస్తుందని వార్తలొస్తున్నాయి.



## లాయర్ అవుతానంటున్న బన్నీ వాసు

టాలీవుడ్‌లో సక్సెస్‌ఫుల్ సినిమాలతో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపుని అందుకున్నాడు బన్నీ వాస్. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుండి మట్నదలైన ప్రస్థానం నేడు గీతా ఆర్ట్స్ 2 లాంటి టాప్ బ్యానర్‌ను లీడ్ చేసే వరకు సాగింది. మట్నదట్లో సినిమాల డిస్ట్రిబ్యూషన్ రంగంలో తన అదృష్టాన్ని పరీక్షించుకుని, ఆ తర్వాత ప్రొడక్షన్ లోకి అడుగుపెట్టారు. మట్నదటి నుండి అల్లు అర్జున్‌కు బెస్ట్ ఫ్రెండ్ కావడమే కాకుండా, అల్లు అరవింద్‌కు నమ్మకస్థుడైన పార్ట్‌నర్‌గా నిలబడ్డారు. నిర్మాతగా మట్నదటి సినిమా '100% లవ్' తోనే మంచి హిట్ అందుకున్నారు. ఆ తర్వాత భలే భలే మగాడివోయ్, గీత గోవిందం, ప్రతి రోజు పండగే వంటి వరుస విజయాలతో బాక్సాఫీస్ దగ్గర తన మార్క్ చూపించారు. కేవలం పెద్ద సినిమాలే కాకుండా, కంటెంట్ ఉన్న చిన్న సినిమాలను ఎంకరేజ్ చేస్తూ ఎంతోమంది కొత్త టాలెంట్‌ను ఇండస్ట్రీకి పరిచయం చేశారు. ఇటీవల 'బీవీ వర్క్స్' పేరుతో కొత్త బ్యానర్ స్టార్ట్ చేసి తన స్నేహితులకు కూడా అవకాశాలు ఇస్తున్నారు. ప్రస్తుతం మరికొన్ని భారీ ప్రాజెక్టులను లైన్ లో పెట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇక సినిమాలతో బిజీగా ఉన్నా, ఎల్‌ఎల్‌బీ పూర్తి చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. ప్రస్తుతం పరీక్షలు రాస్తున్నట్లు తెలుస్తోంది. సినిమా పనులు, షూటింగులతో తీరిక లేకుండా గడుపుతున్నా, తన ఎడ్యుకేషన్ లక్ష్యాన్ని మాత్రం వదిలిపెట్టలేదు. ఈ ఎల్‌ఎల్‌బి పరీక్షలు రాసిన విషయం ఇప్పుడు ఫిలిం సర్కిల్స్‌లో ఇంట్రెస్టింగ్ టాపిక్‌గా మారింది.

## పుష్ప-2 తొక్కిసలాట.. చార్జిషీట్‌లో లోపాలు!



అల్లు అర్జున్ ప్రధాన పాత్రలో నటించిన పుష్ప-2 సినిమా విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద భారీ తొక్కిసలాట చోటుచేసుకున్న విషయం తెలిసిందే. ఈ తొక్కిసలాట ఘటనలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరొకరు నేటికీ ప్రాణాలతో పోరాటం చేస్తున్నారు. ఈ ఘటనపై ఇప్పటికే చార్జిషీట్ ఫైల్ అయ్యింది. అల్లుఅర్జున్ సహా 23 మందిపై అభియోగాలు నమోదు చేస్తూ చార్జిషీట్ వేశారు. థియేటర్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తొక్కిసలాట జరిగినట్టు పోలీసులు నిర్ధారించారు. తాజాగా ఈ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. చార్జిషీట్‌ను నాంపల్లి కోర్టు తిప్పి పంపించింది. ఇలా తిప్పి పంపడం ఇది రెండోసారి కావడం గమనార్హం. దాఖలు చేసిన చార్జిషీట్‌లో లోపాలు ఉన్నట్లు కోర్టు గుర్తించింది. హార్డ్ డిస్క్‌లు, సీడీలు, పెన్ డ్రైవ్‌లు జతపరచకపోవడంతో తాజాగా మరోసారి చార్జిషీట్‌ను రిటర్న్ చేసింది.

## నేను సింగిలేరా బాబూ: మీనా



టాలీవుడ్ సీనియర్ హీరోయిన్ మీనా తన భర్త విద్యాసాగర్ మరణం తర్వాత కూతురు నైనిక బాధ్యతలను భుజాన వేసుకుని ఒంటరిగా జీవిస్తున్నారు. అయితే, ఆమె రెండో పెళ్లి చేసుకోబోతోందంటూ సోషల్ మీడియాలో నిత్యం ఏదో ఒక వార్త చక్కర్లు కొడుతూనే ఉంది. గతంలో ఎన్నిసార్లు ఖండించినా ఈ పుకార్లు ఆగకపోవడంతో, తాజాగా మీనా తన ఆవేదనను, ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ క్లారిటీ ఇచ్చారు. తన రెండో వివాహం గురించి వస్తున్న వార్తలపై మీనా స్పందిస్తూ.. "నా పెళ్లి గురించి వ్యాపిస్తున్న పుకార్లు నన్ను తీవ్రంగా బాధించాయి. నేను ఒక సెలబ్రిటీని, పైగా సింగిల్‌గా ఉన్నాను కదా అని నిజం తెలియకుండానే ఇష్టమొచ్చినట్లు మాట్లాడతారా? మిమ్మల్ని ప్రశ్నించే వారు ఎవరూ లేరని అనుకుంటున్నారా?" అని ఘాటుగా ప్రశ్నించారు.



## ప్రతి ఓటమి పాఠమే: షనయా కపూర్

బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ కపూర్ కూతురు షనాయా కపూర్ ఎట్టకేలకు వెండితెరపై మెరిసింది. అయితే, ఆమె సినిమా ప్రయాణం అనుకున్నంత సాఫీగా ఏమీ సాగలేదు. స్టార్ కిడ్ కావడంతో షనాయా కపూర్ ఎంట్రీపై బాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉండేవి. మొదట కరణ్ జోహార్ నిర్మించాల్సిన 'బేధడక్' సినిమాతో ఆమె ఎంట్రీ ఇవ్వాల్సి ఉంది. కానీ, అనివార్య కారణాల వల్ల ఆ ప్రాజెక్టు మధ్యలోనే ఆగిపోయింది. ఆ తర్వాత విక్రాంత్ మాస్సే సరసన 'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్' సినిమాతో ఆమె తన కలను నెరవేర్చుకుంది. తన కెరీర్ ఆరంభంలో ఎదురైన అడ్డంకులు, పరాజయాల గురించి తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొని షనయా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆ ప్రాజెక్టులు ఆగిపోవడంపై షనాయా స్పందిస్తూ.. "ప్రతిదీ ఒక కారణం కోసమే జరుగుతుందని నేను నమ్ముతాను. జరగాల్సింది ఎలాగైనా జరుగుతుంది. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే, ఆ రోజు నా సినిమాలు ఆగిపోవడం నా మంచికే జరిగిందనిపిస్తోంది. ఆ విరామం నన్ను ఒక మంచి నటిగా తీర్చిదిద్దింది.ప్రతి ఓటమి ఒక పాఠంలా తీసుకుని.. కెమెరా ముందుకు వెళ్లని ఆ సమయంలో నేను నా నటనను మరింత మెరుగుపరుచుకున్నాను " అని చెప్పుకొచ్చింది.

## లెస్బియన్లుగా రష్మిక-కృతిసనన్?

షాహిద్ కపూర్, కృతి సనన్, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న కాక్ టెయిల్ 2 మీద సోషల్ మీడియాలో రకరకాల చర్చలు నడుస్తున్నాయి. ముఖ్యంగా ఈ సినిమాలో నటీనటుల పాత్రల గురించి వస్తున్న ఒక వార్త ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. సాధారణంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీ అని అందరూ అనుకుంటున్న తరుణంలో ఒక షాకింగ్ లీక్ బయటకు వచ్చింది. ఈ చిత్రంలో రష్మిక మందన్న, కృతి సనన్ స్వలింగ ప్రేమికులుగా కనిపించబోతున్నారనే ప్రచారం జోరుగా సాగుతోంది. బాలీవుడ్ మీడియాలో వస్తున్న ఈ వార్త విన్న అభిమానులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఒకవేళ ఇదే నిజమైతే రష్మిక కెరీర్‌లో ఇది ఒక మోస్ట్ ఛాలెంజింగ్ రోల్ అవుతుందని చెప్పాలి. ఇలాంటి వెరైటీ కాన్సెప్ట్‌తో సినిమా వస్తుండటంతో అంచనాలు అప్పుడే పెరిగిపోయాయి.



## విజయవాడ పునుగులు ఇష్టం: ప్రభాస్



టాలీవుడ్ యంగ్ హీరో సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన కపుల్ ఫ్రెండీ రీసెంట్ గా ప్రేక్షకుల ముందుకు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర యూనిట్ స్పెషల్ గా పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో ఓ స్పెషల్ చిట్ చాట్ నిర్వహించింది. ఈ సరదా సంభాషణలో ప్రభాస్ చెప్పిన కొన్ని వ్యక్తిగత జ్ఞాపకాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చిట్ చాట్ సందర్భంగా హీరోయిన్ మానస వారణాసి, ప్రభాస్ ను ఒక ఆసక్తికరమైన ప్రశ్న అడిగింది. విజయవాడ పునుగులు ఎప్పుడైనా తిన్నారా? అని అడగ్గా, ప్రభాస్ తన పాత రోజుల్ని గుర్తు చేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ప్రమోద్ తన బెస్ట్ ఫ్రెండ్ అని, విజయవాడలో ప్రమోద్ వాళ్ల ఇంటి దగ్గరే ఒక పునుగుల బండి ఉండేదని, సమ్మర్ లో ప్రమోద్ వాళ్ల ఇంటికి వెళ్లినప్పుడు ప్రమోద్ వాళ్ల నాన్న వెస్పా మీద తామిద్దరినీ ఎక్కించుకుని చాలా ఫాస్ట్‌గా తీసుకెళ్లి, పునుగులు తినిపించేవారని, ఆ పునుగులు రుచి అంటే తనకెంతో ఇష్టమని, అలాంటి పునుగులను తన లైఫ్ లో మళ్లీ ఎక్కడా తినలేదని, వాటిని గుర్తు చేసుకుంటే ఇప్పుడు కూడా నోరూరుతుందని ప్రభాస్ పేర్కొన్నాడు.





## ప్రగ్యా సోకు.. సోకం!

టాలీవుడ్‌లో ఒక్క సినిమా హిట్టయితే చాలు.. హీరోయిన్ల దశ తిరిగిపోతుంది. కానీ, కొందరికి అదృష్టం మాత్రం అంత ఈజీగా తలుపు తట్టదు. ప్రగ్యా జైస్వాల్ విషయంలో ఇప్పుడు ఇదే జరుగుతోంది. వరుసగా బ్లాక్ బస్టర్ హిట్లు తన ఖాతాలో ఉన్నా, అవకాశాల విషయంలో మాత్రం ఈ అమ్మడు వెనుకబడిపోయింది.

టాలీవుడ్‌లో 'కంచె' సినిమాతో పద్ధతిగా ఎంట్రీ ఇచ్చి అందరినీ మెప్పించిన భామ ప్రగ్యా జైస్వాల్. ఆ తర్వాత 'నక్షత్రం' వంటి చిత్రాల్లో తన గ్లామర్ యాంగిల్ కూడా చూపించింది. ఇక బాలయ్యతో చేసిన 'అఖండ' సినిమా ఆమె కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. 2025 సంక్రాంతికి విడుదలైన 'డాకు మహారాజు'తో పాటు ఇటీవల విడుదలైన 'అఖండ-2' లోనూ కనిపించి మెప్పించింది. ఇన్ని పెద్ద హిట్లు ఉన్నా, ప్రగ్యాకు కొత్త ప్రాజెక్టులు రాకపోవడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా అవకాశాలు తగ్గడంతో ప్రగ్యా తన రూట్ మార్చింది. ప్రస్తుతం ఈమె తన పూర్తి ఫోకస్‌ను సోషల్ మీడియాపై పెట్టింది. నిత్యం ఇన్‌స్టాగ్రామ్‌లో యాక్టివ్‌గా ఉంటూ, గ్లామరస్ ఫోటో షూట్లతో నెటిజన్లకు నిద్ర లేకుండా చేస్తోంది.




# ఆఖరి పంచ్ ఆస్ట్రేలియాదే

## మార్ష్, హెడ్ వీరబాదుడు
## లీగ్ దశలో ఒమన్‌పై విన్

చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా గర్జించింది. నాకౌట్ బెర్తు చేజారిన బాధను దిగమింగుతూ ఒమన్‌పై పంజా విసిరింది. స్వల్ప ఛేదనలో మిచెల్ మార్ష్(64 నాటౌట్), ట్రావిస్ హెడ్(32)లు ప్రత్యర్థి బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డారు. వీరిద్దరూ ఎడాపెడా బౌండరీల మోత మోగించగా ఆసీస్ వడివడిగా లక్ష్యాన్ని కరిగించింది. హెడ్ ఔటయ్యాక.. ఓష్ ఇంగ్లిస్(12 నాటౌట్) రెండు ఫోర్లతో జట్టును గెలిపించాడు. పదో ఓవర్లోనే లక్ష్యాన్ని అందుకున్న కంగారూ టీమ్ రెండో విజయంతో గ్రూప్ బీలో మూడో స్థానానికి ఎగబాకింది. గ్రూప్ దశలోనే ప్రపంచకప్ నుంచి నిష్క్రమించిన ఆస్ట్రేలియా చివరి పోరులో చెలరేగిపోయింది. పసికూన ఒమన్‌ను వణికిస్తూ 9 వికెట్లతో ఘన విజయం సాధించింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ మిచెల్ మార్ష్(64 నాటౌట్) తొలి ఓవర్లోనే మూడు ఫోర్లతో తన ఉద్దేశమేంటో చాటాడు. రెండో ఓవర్లో బౌండరీతో జోరందుకున్న ట్రావిస్ హెడ్(32) మార్ష్‌తో పోటీగా చెలరేగాడు. వీరిద్దరి మెరుపులతో 4.1 ఓవర్‌కే స్కోర్ యాభై దాటింది. మార్ష్, హెడ్ విధ్వంసంతో పవర్ ప్లేను 73 రన్స్ చేసింది. అలీకి చుక్కలు చూపిస్తూ.. మూడు ఫోర్లు, సిక్సర్ బాదాడు మార్ష్. వీరిద్దరి జోరు చూశాక అజేయంగా మ్యాచ్‌ను ముగిస్తారనిపించింది. కానీ, 9వ ఓవర్లో హెడ్ గాల్లోకి లేపిన బంతిని వికెట్ కీపర్‌తో పోటీపడిన షకీల్ ఒడుపుగా అందుకున్నాడు. తొలి వికెట్ తీసిన సంతోషంలో ఒమన్ ఆటగాళ్లకు దక్కినా.. అప్పటికే ఆసీస్ విజయం ఖాయమైంది. 17 పరుగులే అవసరమవ్వగా.. జోష్ ఇంగ్లిస్(12 నాటౌట్)తో కలిసి మార్ష్ లాంఛనం పూర్తి చేశాడు. వరల్డ్‌కప్‌లో బోణీ కొట్టని ఒమన్‌కు చివరి మ్యాచ్‌లోనూ బ్యాటర్లు పెద్ద స్కోర్ అందించలేదు. ఇన్నింగ్స్ తొలి బంతికే ఓపెనర్ అమిర్ కలీం(0)ను బౌల్డ్ చేసి గ్జావియర్ బార్ట్‌లెట్(2-27) వికెట్ల వేటకు తెరతీశాడు. బార్ట్‌లెట్, ఎల్లిస్ విజృంభణతో పవర్ ప్లేలో కీలక వికెట్లు పడగా.. ఒమన్ కష్టాల్లో కూరుకుపోయింది. అసలే తడబడుతున్న ప్రత్యర్థి బ్యాటర్లను ఆడం జంపా(4-21) మరింత దెబ్బకొట్టాడు. హమ్మద్ మిర్జా(16) వికెట్‌తో ఖాతా తెరిచిన లెగ్ స్పిన్నర్ కోలుకోలేకపోయింది. వసీం అలీ(32) పోరాడినా.. సహచరులు డగౌట్‌కు క్యూ కట్టారు. చివరి బ్యాటర్ షఫీక్ జైన్(0)ను బౌల్డ్ చేసిన జంపా 104 వద్ద ఒమన్ ఇన్నింగ్స్‌కు తెరదించాడు. నాలుగు వికెట్ల పడగొట్టిన జంపా.. పొట్టి వరల్డ్‌కప్ చరిత్రలో రెండో అత్యధిక వికెట్ల వీరుడిగా అవతరించాడు. బంగ్లాదేశ్ వెటరన్ షకీబుల్ హసన్50 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. రషీద్ ఖాన్ (43 వికెట్లు) మూడో స్థానానికి పడిపోయాడు.







# జింబాబ్వేతో జాగ్రత్త!

### భారత్‌కూ షాకిస్తుందా?

టీ20 వరల్డ్ కప్ 2026 ఉత్కంఠభరితమైన రెండో దశకు చేరుకుంది. మొత్తం 20 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీలో ఇప్పుడు కేవలం 8 జట్లు మాత్రమే మిగిలాయి. ఫిబ్రవరి 21 నుంచి సూపర్-8 పోరు ప్రారంభం కానుంది. అయితే ఈ సూపర్-8కు చేరిన జట్లలో నాలుగు జట్లు మాత్రం గ్రూప్ స్టేజ్‌లో ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి అజేయంగా నిలిచాయి. ముఖ్యంగా ఈ జాబితాలో ఉన్న మూడో జట్టు గురించి ఎవరూ కనీసం ఊహించలేదు. సూపర్-8లో గ్రూప్-1ను విశ్లేషకులు 'గ్రూప్ ఆఫ్ డెత్' అని పిలుస్తున్నారు. ఇందులో భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే ఉన్నాయి. విశేషం ఏంటంటే, ఈ నాలుగు జట్లు గ్రూప్ దశలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. ఇప్పుడు ఇవన్నీ ఒకే గ్రూప్‌లో ఉండటంతో, కేవలం రెండు జట్లు మాత్రమే సెమీఫైనల్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఇక్కడ ఒక చిన్న పొరపాటు చేసినా టోర్నీ నుండి నిష్క్రమించాల్సిందే. ఈ టోర్నీలో అతిపెద్ద సంచలనం ఎవరంటే అది నిస్సందేహంగా జింబాబ్వేనే. గ్రూప్ దశలో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి మాజీ ఛాంపియన్లను మట్టికరిపించి అజేయంగా నిలిచింది. జింబాబ్వే ఇలాంటి ప్రదర్శన చేస్తుందని ఎవరూ కలలో కూడా ఊహించలేదు. ఇప్పుడు సూపర్-8లో భారత్, దక్షిణాఫ్రికా వంటి జట్లకు కూడా వీరు గట్టి పోటీనిచ్చేలా కనిపిస్తున్నారు.

### ముకద్దర్ కా సికందర్

సోషల్ మీడియాలో ఆ జట్టు కెప్టెన్ సికందర్ రజా పేరు హోరెత్తిపోతోంది. జింబాబ్వే జట్టును ఇకపై అండర్ డాగ్ గా చూడకూడదని, సూపర్ 8 లో ఏ జట్టునైనా ఓడించే సత్తా దానికి ఉందని నెటిజన్లు హెచ్చరిస్తోన్నారు. ఈ టోర్నమెంట్ లీగ్ దశలో సికందర్ రజా హీరోగా నిలిచాడని, తన జట్టుకు అపూర్వ విజయాలను అందించాడని ప్రశంసిస్తున్నారు.







# భారత్ సెమీస్ చేరదు

## మహ్మద్ అమీర్

టీ20 వరల్డ్ కప్ 2026 కీలక దశకు చేరుకుంది. లీగ్ దశ ముగిసి సూపర్-8 సమరానికి తెరలేస్తున్న వేళ మైదానంలో ఆట కంటే ముందే మైండ్ గేమ్స్ మొదలయ్యాయి. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌కు చెందిన మాజీ క్రికెటర్ మహ్మద్ ఆమిర్ టీమిండియాపై చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో కార్చిచ్చు రేపుతున్నాయి. టీమిండియా సెమీఫైనల్‌కు చేరే అవకాశమే లేదంటూ ఆయన చేసిన జోస్యంపై క్రికెట్ అభిమానులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. లీగ్ దశలో టీమిండియా అజేయంగా నిలిచినప్పటికీ.. మహ్మద్ ఆమిర్ మాత్రం భారత బ్యాటింగ్ వైఫల్యాలనే ప్రధానంగా ప్రస్తావించారు. పాకిస్థాన్‌తో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో మినహా, మిగిలిన లీగ్ మ్యాచ్‌ల్లో భారత టాపార్డర్ తడబడిందని ఆయన విమర్శించారు. అమెరికా, నమీబియా వంటి జట్లతో ఆడినప్పుడు కూడా బ్యాటింగ్ లైనప్ కుప్పకూలిందని.. ఇలాంటి ప్రదర్శనతో బలమైన జట్లు ఉండే సూపర్-8లో నెగ్గుకురావడం అసాధ్యమని ఆమిర్ అభిప్రాయపడ్డారు.

### సూపర్-8 సమీకరణాలు

**ప్రస్తుత టోర్నీలో సూపర్-8 జట్లను రెండు గ్రూపులుగా విభజించారు:**

**గ్రూప్-1: భారత్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే.**

**గ్రూప్-2: పాకిస్థాన్, న్యూజిలాండ్, ఇంగ్లాండ్, శ్రీలంక.**

# సీనియర్లకు బీసీబీ షాక్!


### సీనియర్ల జీతాల్లో భారీ కోత

ఇటీవల భారత్‌లో టీ20 ప్రపంచకప్‌లో ఆడబోమంటూ ఐసీసీ ఆగ్రహానికి గురైన బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు.. సీనియర్లకు షాకిచ్చింది. అంతర్జాతీయ క్రికెట్‌లో మెరుస్తున్న పలువురికి జీతాల్లో భారీ కోత విధించింది. వార్షిక సెంట్రల్ కాంట్రాక్టులో కుర్రాళ్లకు ప్రాధాన్యమిచ్చిన బోర్డు... మాజీ కెప్టెన్ నజ్ముల్ హుసేన్ శాంటో, పేసర్ తస్కిన్ అహ్మద్‌లను గ్రేడ్ ఏలోకి మార్చింది. వెటరన్ ముష్ఫికర్ రహీంను ఏకంగా బీ గ్రేడ్ కేటాయించింది. కెప్టెన్ లిటన్ దాస్ గ్రేడ్ ఏలో ఉండగా.. ఆల్‌రౌండర్ మెహిదీ హసన్ మిరాజ్‌కు సైతం చోటు దక్కింది. సెంట్రల్ కాంట్రాక్టు విధానంలో బీసీసీఐని అనుసరించింది బంగ్లాదేశ్ బోర్డు. ఇటీవల భారత బోర్డు ఏ ప్లస్ గ్రేడ్‌ను ఎత్తివేయగా.. బీసీబీ సైతం అదే పని చేసింది. దాంతో.. ఇంతకుముందు ఈ కేటగిరీలో ఉన్న తస్కిన్ అహ్మద్ ఏ గ్రేడ్‌కు వచ్చాడు. నెలకు రూ.7 లక్షలు అందుకున్న తస్కిన్‌కు ఇకపై రూ.5.9లక్షలు మాత్రమే దక్కనున్నాయి. నిరుడు ఆసియా కప్‌లో నిలకడగా రాణించిన షద్మాన్, తంజిద్ హసన్, రిషద్ హొసేనర్‌తో పాటు మహెది హసన్‌కు ప్రమోషన్ దక్కింది. ఇదివరకూ గ్రేడ్ సీలో ఉన్న వీరంతా గ్రేడ్ బీకి ఎంపికయ్యారు. గ్రేడ్ బీలోని ఆటగాళ్లకు నెలకు రూ.4.4 లక్షలు బీసీబీ చెల్లించనుంది. ఈ లెక్కన గ్రేడ్ సీ, గ్రేడ్ డీలోని క్రికెటర్లకు లక్షకు పైగా ఆదాయం రానుంది.

# ఆసియా కప్ ఫైనల్లో భారత్

### శ్రీలంకను పడగొట్టిన రాధ యాదవ్

మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో భారత ఏ జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపి టైటిల్‌కు అడుగు దూరంలో నిలిచింది. స్వల్ప ఛేదనలో ఓపెనర్ వింద దినేశ్(42), రాధా యాదవ్(32 నాటౌట్, 4-19) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడడంతో 5 వికెట్ల తేడాతో లంకను చిత్తు చేసింది. ఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది. బ్యాంకాక్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్‌లో భారత ఏ జట్టు పంజా విసిరింది. లీగ్ దశలో అదరగొట్టిన టీమిండియా సెమీఫైనల్లోనూ చెలరేగిపోయింది. భారీ స్కోర్‌తో భారత్‌కు చెక్ పెట్టాలనుకున్న లంక ఆశలకు కెప్టెన్ రాధా యాదవ్ (4-19) అడ్డుకట్ట వేసింది. వికెట్ల వేటతో రెచ్చిపోగా.. ప్రత్యర్థి 118 పరుగులకే కుప్పకూలింది. లంక జట్టులో ఓపెనర్లు సంజనా కవింది(31), హన్సిమ కరుణరత్నే(14)లను విడదీసి తనూజ కన్వర్ బ్రేకివ్వగా.. అక్కడి నంచి రాధా యాదవ్ తిప్పేసింది. మిడిలార్డర్‌ను పడగొట్టిన తను.. లోయర్ ఆర్డర్‌ను డగౌట్ చేర్చింది. ఆఖర్లో శశిని గుహ్మని(22) మాత్రమే రాణించగా లంక 118కి ఆలౌటయ్యింది. ప్రత్యర్థిని తక్కువకే కట్టడి చేసి సగం విజయం సాధించిన భారత్‌కు ఓపెనర్లు నందినీ కశ్యప(14), వింద దినేశ్‌లో (42) అదిరే ఆరంభమిచ్చారు. వీరిద్దరూ ఔటయ్యాక క్రీజునంటుకుపోయిన రాధా యాదవ్(31 నాటౌట్) లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంది. అజేయంగా నిలిచి జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లింది. 5 వికెట్ల తేడాతో టీమిండియా జయకేతనం ఎగురవేసిన భారత్ ఆదివారం జరుగబోయే టైటిల్ పోరులో బంగ్లాదేశ్‌ను ఢీకొట్టనుంది.



# రాహుల్ చాహర్‌కు విడాకులు

భారత యువ లెగ్ స్పిన్నర్ రాహుల్ చాహర్ తన భార్య ఈశానీ జోహార్‌తో అధికారికంగా విడాకులు తీసుకున్నట్లు ప్రకటించాడు. 'నేను చాలా తక్కువ వయసులోనే వివాహం చేసుకున్నాను. ఆ సమయంలో నా విలువలు, నా జీవిత గమ్యం గురించి నాకు పూర్తి అవగాహన లేదు' అని ఆయన పేర్కొన్నారు. గత 15 నెలలుగా కోర్టుల చుట్టూ తిరగడం తనకు ఎంతో సహనాన్ని, ఓర్పును నేర్పిందని రాహుల్ వెల్లడించాడు. ఈ బంధం ముగియడంపై రాహుల్ సానుకూలంగా స్పందించాడు. "నేను ఈ అధ్యాయాన్ని కోపంతోనో లేదా పశ్చాత్తాపంతోనో ముగించడం లేదు. కొన్ని బంధాలు జీవితాంతం ఉండవు, కానీ అవి మనల్ని మేల్కొల్పడానికి, మనకు పాఠాలు నేర్పడానికి వస్తాయి. ఇప్పుడు నేను మునుపటి కంటే మరింత స్పష్టతతో, అవగాహనతో ఉన్నాను" అని రాహుల్ రాసుకొచ్చాడు. దీన్ని ఓ ముగింపుగా కాకుండా, కొత్త ప్రారంభంగా చూస్తున్నట్లు ఆయన తెలిపాడు.

# వాటర్ పైప్ పగిలేలా హిట్టింగ్!

రాజస్థాన్ రాయల్స్ నెట్స్ ప్రాక్టీస్‌లో భాగంగా వైభవ్ సూర్యవంశీ ఒక బంతిని ఎంత బలంగా బాదాడంటే.. ఆ బంతి వాయువేగంతో వెళ్లి నేరుగా అక్కడ ఉన్న వాటర్ పైపును ఢీకొట్టింది. ఆ దెబ్బకు పైప్ కాస్తా పగిలిపోయింది. ఈ వీడియోను రాజస్థాన్ రాయల్స్ తన అధికారిక 'ఎక్స్' (ట్విట్టర్) ఖాతాలో షేర్ చేస్తూ.. "సూర్యవంశీ మాత్రమే ఇలా చేయగలడు" అని స్మైలీ ఎమోజీని జత చేసింది. ఈ టీనేజర్ హిట్టింగ్ పవర్ చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. నెట్స్‌లోనే ఇలా ఉంటే, ఇక మ్యాచ్‌ల్లో బంతి స్టేడియం అవతల పడటం ఖాయమని కామెంట్స్ చేస్తున్నారు.

# అఫ్ఘనిస్థాన్ కోచ్ ట్రాట్ వీడ్కోలు

ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్‌ను ప్రపంచ వేదికపై ఓ శక్తివంతమైన జట్టుగా నిలబెట్టిన కోచ్ జోనాథన్ ట్రాట్ తన పదవీకాలాన్ని ముగించారు. టీ20 ప్రపంచ కప్ 2026లో ఆఫ్ఘనిస్తాన్ ప్రయాణం గ్రూప్ దశలోనే ముగిసినప్పటికీ.. కెనడాపై గెలుపుతో గౌరవప్రదంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ట్రోట్ తన మనసులోని మాటలను పంచుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు. తను కోచ్‌గా బాధ్యతలు స్వీకరించడం వెనుక ఉన్న కథను గుర్తుచేసుకున్నారు. 'నిజానికి ఈ పదవి నాకంటే ముందు నా సహచరుడు గ్రాహం థోర్ప్‌కు దక్కాల్సింది. కానీ ఆయన ఆరోగ్య కారణాల దృష్ట్యా ఆ బాధ్యత తీసుకోలేకపోయారు. అలా అదృష్టవశాత్తూ 2022లో ఈ అవకాశం నా తలుపు తట్టింది. దాన్ని నేను పూర్తి ఉత్సాహంతో స్వీకరించాను. ఈ నాలుగేళ్ల ప్రయాణం నా జీవితంలో మర్చిపోలేనిది' అని పే[illegible]న్నాడు.

# కెనడా క్రికెటర్ నవనీత్ గుడ్‌బై

కెనడా క్రికెట్ చరిత్రలో మోస్ట్ సక్సెస్‌ఫుల్ క్రికెటర్, మాజీ కెప్టెన్ నవనీత్ ధలివాల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గురువారం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్ జట్టుతో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్ తర్వాత ఆయన తన 11 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికాడు. 37 ఏళ్ల నవనీత్ ధలివాల్ కెనడా తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. తన కెరీర్లో 48 టీ20 మ్యాచ్‌ల్లో 1305 పరుగులు సాధించాడు. కేవలం బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా ఆయన జట్టును సమర్థవంతంగా నడిపించాడు. ఆయన నాయకత్వంలో కెనడా 29 టీ20ల్లో ఏకంగా 21 విజయాలను అందుకోవడం విశేషం.

ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 21-2-2026

# ఓట్ల కోసమేనా బీసీ నినాదం?

భారతదేశ రాజకీయ యవనికపై బీసీ అనే పదం అత్యంత శక్తివంతమైన ఓటు బ్యాంకుగా మారింది. అయితే, ఎన్నికల గంట మోగగానే గొంతు విప్పే బీసీ నేతలు, ఎన్నికలు ముగియగానే మౌనముద్ర దాల్చడం ఒక పరిపాటిగా మారింది. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మళ్లీ బీసీ రిజర్వేషన్ల అంశం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా జీవో నంబర్ 9 జారీ చేసినా, అది కోర్టు మెట్ల వద్దే ఆగిపోయింది. అదే సమయంలో ఏపీలో కూటమి ప్రభుత్వం బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ప్రకటించింది. టీజీలో 42 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రస్తుతం అధికార, ప్రతిపక్షాల మధ్య పెద్ద ఎత్తున క్రెడిట్ వార్ నడిచింది. రిజర్వేషన్ల అమలుపై స్పష్టత రాకుండా ఎన్నికల నోటిఫికేషన్ ఇస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని బీసీ సంఘాలు ధర్నాలకు దిగుతున్నాయి. అయితే, ఇక్కడ బీసీ రిజర్వేషన్ల సాధనలో విఫలమవుతున్నామన్న విమర్శలకు ప్రధాన కారణం నేతల మధ్య ఐక్యత లేకపోవడమే. బీసీ నేతలు తమ వర్గం హక్కుల కంటే తామున్న రాజకీయ పార్టీల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. పార్టీ అధిష్టానం కనుసన్నల్లో పనిచేస్తూ, సామాజిక న్యాయం కంటే ఓట్ల సమీకరణకే ప్రాధాన్యమిస్తున్నారు. 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని అధిగమించేలా రాజ్యాంగ సవరణలు తీసుకురావడంలో లేదా కోర్టుల్లో పటిష్టమైన వాదనలు వినిపించడంలో నేతలు విఫలమవుతున్నారు. సరైన గణాంకాలు లేకపోవడం రిజర్వేషన్ల పెంపుకు పెద్ద అడ్డంకిగా మారింది. ఎన్నికల ముందు ప్రకటించే హామీలు అమలుకు వచ్చేసరికి 'సాంకేతిక కారణాల' వంకతో వాయిదా పడుతున్నాయి. బీసీ నేతలు తమ స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, సామాజిక బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్లు అనేవి కేవలం ఎన్నికల నినాదాలుగా మిగిలిపోకూడదు. అన్ని పార్టీల్లోని బీసీ నేతలు ఏకతాటిపైకి వచ్చి, రిజర్వేషన్ల పరిమితి పెంపుపై కేంద్రాన్ని ఒత్తిడి చేయాలి. ఎన్నికల వేళ మాత్రమే కాకుండా, హక్కుల సాధన కోసం నిరంతరాయంగా ఉద్యమించినప్పుడే బీసీలకు నిజమైన రాజకీయ భాగస్వామ్యం లభిస్తుంది. నిజమైన సామాజిక న్యాయం అంటే ఓట్ల పంపకం కాదు, అధికారంలో సముచిత వాటా. ఆ దిశగా బీసీ నాయకత్వం అడుగులు వేయకపోతే, ఎన్నికల స్టంట్లు అనే విమర్శల నుంచి వారు ఎప్పటికీ తప్పించుకోలేరు

– ఈవార్తలు సంపాదకీయ విభాగం







# క్రికెట్ మైదానంలో భారత్ 'విశ్వరూపం'

క్రీడలను క్రీడలుగా చూడకుండా, రాజకీయ స్వార్థానికి వాడుకోవాలనుకునే శక్తులకు 2026 టీ20 ప్రపంచకప్ ఒక గుణపాఠంగా మారింది. భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నీలో టీమిండియాను ఇరుకున పెట్టాలని పాకిస్థాన్, బంగ్లాదేశ్ వేసిన ఎత్తుగడలు చివరికి వారిని 'ఆత్మరక్షణ'లో పడేశాయి. భారత్‌లో ఆడటానికి భద్రతా కారణాలు సాకుగా చూపుతూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఏకంగా టోర్నీనే బహిష్కరించడం ఒక వింతైన చర్య. ఐసీసీ భద్రతా హామీలు ఇచ్చినా, పాక్ రెచ్చగొట్టడంతో బంగ్లాదేశ్ తన నిర్ణయానికే మొగ్గు చూపింది. అయితే, భారత్ వెనక్కి తగ్గకుండా పంతం నెగ్గించుకోవడంతో ఐసీసీ కఠిన నిర్ణయం తీసుకుంది.

బంగ్లాదేశ్‌ను టోర్నీ నుంచి తొలగించి, ఆ స్థానంలో స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించడం ద్వారా భారత్ తన పట్టును నిరూపించుకుంది. బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరిస్తామంటూ ప్రగల్భాలు పలికిన పాకిస్థాన్ చివరకు తోక ముడిచింది. ఫిబ్రవరి 15న కొలంబోలో జరగాల్సిన హై-వోల్టేజ్ మ్యాచ్ ఆడకపోతే ఐసీసీ నుంచి వచ్చే భారీ జరిమానాలు, ఆర్థిక నష్టాలను తట్టుకోలేమని గ్రహించిన పాక్ ప్రభుత్వం చివరి నిమిషంలో 'యూ-టర్న్' తీసుకుంది. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఆటకు దూరమవ్వాలనుకున్న పాక్ ప్రయత్నం ఆ దేశ క్రికెట్ అభిమానుల ముందు అపహాస్యమైంది. ఈ మొత్తం వ్యవహారంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి తన దౌత్యనీతిని చాటుకుంది. షెడ్యూల్ మార్పులకు ఏమాత్రం ఒప్పుకోకుండా, నిబంధనల ప్రకారం టోర్నీ సాగాలని పట్టుబట్టింది. పాకిస్థాన్ చేస్తున్న రెచ్చగొట్టే చర్యలను బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా బహిరంగంగానే ఎండగట్టారు. భారత్ లేనిదే క్రికెట్ ప్రపంచం లేదని, ఆర్థికంగా కూడా ఐసీసీకి భారత్ వెన్నెముక అని మరోసారి స్పష్టమైంది. మైదానంలో బ్యాట్, బాల్‌తో కాకుండా కుట్రలతో గెలవాలనుకున్న పాక్, బంగ్లాదేశ్‌లకు ఈ ప్రపంచకప్ పరాభవాన్ని మిగిల్చింది. నిబంధనలకు కట్టుబడి ఉంటేనే గౌరవమని, భారత్ తన పంతం నెగ్గించుకోవడం ద్వారా ప్రపంచ క్రికెట్‌కు బలమైన సందేశాన్ని పంపింది. ఆటలో రాజకీయాల జోక్యం పనికిరాదని చెప్పడానికి ఇదే నిలువెత్తు సాక్ష్యం.



వినోద్ కుమార్

# తెలుగుకు తెగులు

దేశ భాషలందు తెలుగు లెస్స అన్న పలుకులు ఇప్పుడు కేవలం పుస్తకాలకే పరిమితమవుతున్నాయి. ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని ప్రపంచం కొనియాడిన మన భాష, నేడు స్వరాష్ట్రంలోనే తెగులు పట్టిన స్థితిలో కొట్టుమిట్టాడుతోంది. అక్షర రూపం మారుతోంది, ఉచ్చారణ కలుషితమవుతోంది, చివరకు ఉనికికే ముప్పు వాటిల్లుతోంది. మన భాషకు పట్టిన మొదటి తెగులు అతి ఇంగ్లీష్. అమ్మను మమ్మీ అని, నాన్నను డాడీ అని పిలవడంలోనే గొప్పతనం ఉందని భ్రమపడుతున్నాం. ఇంట్లో పిల్లలతో తెలుగులో మాట్లాడటం తక్కువతనంగా భావించే మేధావుల సంఖ్య పెరుగుతోంది. ఫలితంగా, కొత్త తరం పిల్లలకు తెలుగు చదవడం, రాయడం పక్కన పెడితే.. కనీసం స్పష్టంగా మాట్లాడటం కూడా రావడం లేదు. నేటి ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియాలో తెలుగు అక్షరాల ఖూనీ జరుగుతోంది.




మహాప్రాణ అక్షరాలను (ఖ, ఘ, ఛ వంటివి) పలకడం మానేశాం. భాషను బాస అని, శుభంను సుబం అని పలికే వింత ధోరణి పెరిగింది. టీవీ యాంకర్ల నుంచి సామాన్యుల వరకు మంగళగిరిని మంగలగిరిగా మార్చేస్తూ అపభ్రంశపు పలుకులతో భాషా సౌందర్యాన్ని చెడగొడుతున్నారు. మనం మాట్లాడుతున్నది తెలుగా? ఇంగ్లిషా? అంటే సమాధానం చెప్పలేని పరిస్థితి. 'నేను నీకు ఒక మెసేజ్ పంపిస్తాను, నువ్వు అది చెక్ చేసి నాకు రిప్లై ఇవ్వు' – ఈ వాక్యంలో తెలుగు క్రియాపదాలు తప్ప మిగిలినవన్నీ పరభాషా పదాలే. ఇలా ప్రతి వాక్యంలోనూ పరభాషా పదాలను జొప్పించి తెలుగును ఒక సంకర భాషగా మారుస్తున్నాం. ప్రభుత్వాలు మారుతున్నా తెలుగు పట్ల వివక్ష మారడం లేదు. పాఠశాలల్లో తెలుగును ఒక తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడంలో వైఫల్యం, ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అమలు కాగితాలకే పరిమితం కావడం భాషా వికాసానికి గొడ్డలి పెట్టుగా మారింది. తెలుగు భాషా ప్రాధికార సంస్థ వంటి సంస్థలు ఉన్నా, వాటికి సరైన నిధులు, అధికారాలు లేకపోవడం శోచనీయం. నేటి యువతకు తెలుగు కథలు, కవితలు, సాహిత్యం పట్ల అవగాహన శూన్యం. వేమన పద్యం అడిగితే తడుముకోవాల్సిన పరిస్థితి. గ్రంథాలయాలు వెలవెలబోతున్నాయి, పుస్తక పఠనం కనుమరుగవుతోంది. భాషకు పట్టిన ఈ తెగులును వదిలించాల్సింది రాజకీయ నాయకులో, కవులో మాత్రమే కాదు.. ప్రతి తెలుగు వాడూ తన బాధ్యతగా గుర్తించాలి. మన ఇంటి భాషను మనం గౌరవించుకోకపోతే, భవిష్యత్తులో తెలుగు కేవలం ఒక మృత భాషగా మిగిలిపోయే ప్రమాదం ఉంది.

**అమ్మ భాష.. అస్తిత్వానికి మూలం**

భాష కేవలం భావ వ్యక్తీకరణకు సాధనం మాత్రమే కాదు, అది ఒక జాతి సంస్కృతికి, చరిత్రకు మరియు సజీవ అస్తిత్వానికి ప్రతిబింబం. ప్రతి ఏటా ఫిబ్రవరి 21న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం మన మాతృభాషల పరిరక్షణను మరోసారి గుర్తుచేస్తోంది. 1952లో బంగ్లాదేశ్‌లో (అప్పటి తూర్పు పాకిస్తాన్) తమ మాతృభాష 'బెంగాలీ' కోసం ప్రాణత్యాగం చేసిన విద్యార్థుల స్మారకార్థం యునెస్కో 1999లో ఈ దినోత్సవాన్ని ప్రకటించింది. 2026 సంవత్సరానికి గాను యునెస్కో బహుభాషా విద్యపై యువత స్వరాలు అనే ఇతివృత్తాన్ని ఎంచుకుంది. భాషా వైవిధ్యాన్ని కాపాడుకోవడంలో యువత పాత్ర ఎంత కీలకమో ఇది స్పష్టం చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి రెండు వారాలకు ఒక భాష కనుమరుగవుతోందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ జనాభాలో సుమారు 40% మందికి వారు మాట్లాడే లేదా అర్థం చేసుకునే భాషలో విద్య అందడం లేదు. ఉపాధి అవకాశాల కోసం ఆంగ్లం వంటి అంతర్జాతీయ భాషలపై పెరుగుతున్న మోజులో మాతృభాషలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. మాతృభాషలో ప్రాథమిక విద్య అభ్యసించడం వల్ల పిల్లల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి మెరుగుపడతాయని శాస్త్రీయంగా నిరూపితమైంది. ఆధునిక కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి సాంకేతికతను ఉపయోగించి మన భాషా వారసత్వాన్ని డిజిటల్ రూపంలో భద్రపరచుకోవాల్సిన అవసరం ఉంది.

కనీసం ప్రాథమిక స్థాయి వరకు తెలుగు మాధ్యమంలో బోధన తప్పనిసరి చేయాలి. మాతృభాషలో నేర్చుకోవడం వల్ల పిల్లల్లో గ్రహణ శక్తి పెరుగుతుంది. తెలుగు సాహిత్యాన్ని కేవలం పరీక్షల కోసమే కాకుండా, విద్యార్థుల్లో ఆసక్తి కలిగించేలా కథలు, గేయాలు, నాటక రూపాల్లో బోధించాలి. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తర ప్రత్యుత్తరాలు, జీవోలు, దరఖాస్తులు ప్రజలకు అర్థమయ్యే సరళమైన తెలుగులో ఉండేలా చూడాలి. కింది స్థాయి కోర్టుల తీర్పులు తెలుగులో వెలువడేలా చర్యలు తీసుకోవడం వల్ల సామాన్య ప్రజలకు న్యాయం చేరువవుతుంది. తెలుగు వికీపీడియా వంటి విజ్ఞాన సర్వస్వాల్లో సమాచారాన్ని పెంచడం ద్వారా ఇంటర్నెట్‌లో తెలుగు ఉనికిని చాటాలి. కృత్రిమ మేధ టూల్స్, అనువాద సాఫ్ట్‌వేర్‌లలో తెలుగు భాషను మరింత కచ్చితత్వంతో అభివృద్ధి చేయాలి. ఇంట్లో పిల్లలతో సాధ్యమైనంత వరకు తెలుగులోనే మాట్లాడాలి. పలకరింపులు, సంభాషణల్లో తెలుగు పదాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. పిల్లలకు చందమామ, బాలభారతం వంటి కథల పుస్తకాలను పరిచయం చేయాలి. తెలుగు అకాడమీ ప్రచురించే విలువైన పుస్తకాలను ఆదరించాలి. ప్రభుత్వ ఉద్యోగాల్లో తెలుగు ఒక సబ్జెక్టుగా చదివిన వారికి లేదా తెలుగు మీడియం అభ్యర్థులకు ప్రాధాన్యం కల్పించాలి. యువ రచయితలను ప్రోత్సహించడానికి గ్రామీణ, పట్టణ స్థాయిల్లో కవితా పోటీలు, సాహిత్య సభలు నిర్వహించాలి.



శశిధర్ అక్కెల

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.